

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఉన్నచో ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట : 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు : 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు : 97036 18724
మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె : 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరం, సత్యవేడు : 99890 59755

పాఠశాలకు కూతవేటు దూరంలో క్వారీయింగ్

భయం గుప్పిట్లో విద్యార్థులు

ఈ చదువులు 'బండ'పాలు!

అవును, వీళ్ల చదువులు 'బండ'పాలవుతున్నాయి. ఏ క్షణంలో గ్రానైట్ ముక్క వచ్చి మీద పడుతుందో, ఎవరికి ప్రాణాపాయం సంభవిస్తుందోనన్న భయం గుప్పిట్లో చదువులు సాగిస్తున్నారు. ఈ పాఠశాలకు కూతవేటు దూరంలో నడుస్తున్న క్వారీ వల్ల, వాటినుంచి వస్తున్న శబ్దాలు, పడుతున్న రాళ్ల ముక్కల వల్ల సి.బండపల్లె పాఠశాల విద్యార్థులు నిత్యం ప్రాణభయంతో గడపాల్సి వస్తోంది. - కుప్పం



క్వారీలో యథేచ్ఛగా సాగుతున్న పనులు


నిత్యం తవ్వకాలు, పేలుళ్లతో ఏర్పడిన సొరంగంలాంటి గోతులు

ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో శాంతిపురం మండలం సి.బండపల్లె వద్ద ఉన్న క్వారీని సందర్శించి, ఇక్కడ జరుగుతున్న అక్రమ క్వారీయింగ్ విషయంలో నాటి వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తర్వాత క్వారీయింగ్ ఆగినట్లు ఆగి, నాటి వైసీపీ నేతలు మళ్లీ మొదలు పెట్టిన విషయమూ కొత్తకాదు. అయితే చంద్రబాబు తనిఖీలకు వెళ్లిన క్వారీకి సుమారు ఒకట్రెండు కిలోమీటర్ల దూరంలో మరో క్వారీ ఉంది. దీనికి పర్మిషన్ ఎవరిచ్చారో, ఎలా ఇచ్చారో కానీ, అటువంటి అనుమతివల్ల ఇప్పుడు విద్యార్థుల ప్రాణాలు ప్రమాదంలో పడ్డాయి. సి.బండపల్లె రెవెన్యూ సర్వే నెంబరు 153లో నడుస్తున్న క్వారీ, ప్రభుత్వ పాఠశాలల సముదాయానికి కేవలం 25 మీటర్ల దూరంలో ఉంది. పేరుకు ఈ దూరాన్ని చెప్పుకోగలము కానీ, ఆ క్వారీ విస్తరించిన సరిహద్దుకు ఆనుకునే పాఠశాల నడుస్తోంది. నిజానికి సి.బండపల్లెలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఇక్కడ ఎన్నాళ్లనుంచో ఉంది. ప్రస్తుతం పాఠశాల పాత భవనాలను ప్రాథమిక పాఠశాలకు, అంగన్వాడీ కేంద్రానికి ఇచ్చేశారు. అసంపూర్తిగా నిర్మాణమైన నూతన భవనంలోకి ఉన్నత పాఠశాలను మార్చారు. ఈ భవనమైతే క్వారీకి ఇంకా దగ్గరగా ఉంది. కుప్పానికి చెందిన వైసీపీ నాయకుడు ఒకరు క్వారీ నడుపుతున్నారు. వారం కిందట మైన్స్ అండ్ జియాలజీ అధికారులు సి.బండపల్లెలోని అన్ని క్వారీలను తనిఖీ చేస్తూ పాఠశాల సమీపంలోని ఈ క్వారీ వద్దకు కూడా వచ్చి వెళ్లారు. అప్పట్లో విద్యార్థులతోపాటు గ్రామస్థులు కూడా క్వారీ వల్ల తాము పడుతున్న ఇబ్బందులను అధికారులకు విన్నవించారు. తనిఖీలు జరిపి వెళ్లి సుమారు వారం రోజులవుతోంది కానీ, ఇంతదాకా క్వారీ మీద ఎటువంటి చర్యా తీసుకోలేదు. అంతేకాదు.. క్వారీలో యథేచ్ఛగా పనులు నడుస్తున్నాయి. పొక్లెయినర్లు పెట్టి బండను తవ్వి పైకెత్తుతున్నారు. లోతైన గుంతలు కొట్టి, భూగర్భంనుంచి వెలికి తీస్తున్నారు.

అరచేతుల్లో విద్యార్థుల ప్రాణాలు

పాఠశాలకు అత్యంత సమీపంలో నడుస్తున్న క్వారీ వల్ల విద్యార్థులు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని కాలం గడపాల్సిన పరిస్థితి నెలకొంది. క్వారీలో బండ తవ్వకాలకోసం జరిపే పేలుళ్లు, తవ్విన క్వారీ బండలను రవాణా చేయడానికి రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాల రొదతో నిత్యం శబ్దకాలుష్యమే కాదు, వాయు కాలుష్యం కూడా ఏర్పడుతోంది. దుమ్ము ధూళి మధ్య విద్యార్థులు చదువులు సాగించలేక అనారోగ్యం పాలవుతున్నారు. అంతేకాదు.. అప్పుడప్పుడూ క్వారీలో జరిపే పేలుళ్ల వల్ల క్వారీ రాళ్ల ముక్కలు వచ్చి పాఠశాల ఆవరణలో పడుతున్నాయి. వీటివల్ల విద్యార్థులకు గాయాలైన సందర్భాలు కూడా ఉన్నాయి. ఎప్పుడు ఎవరికి మూడుతుందోనన్న భయంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే క్వారీ లీజును రద్దు చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. పాఠశాల సమీపంలో నడుస్తున్న క్వారీ గురించి శాంతిపురం తహశీల్దారు మురళీకృష్ణను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా, పాఠశాల సమీపంలో క్వారీ ఏర్పాటుకు 2015లోనే అప్పటి రెవెన్యూ అధికారులు ఎన్వోసీ ఇచ్చారని చెప్పారు. తర్వాత 2022లో మైన్స్ అండ్ జియాలజీ అధికారులు తవ్వకాలకు పర్మిషన్ ఇచ్చారని వివరించారు.



క్వారీ సమీపంలో నడుస్తున్న ప్రాథమిక పాఠశాల


భయం గుప్పిట్లో జడ్పీ ఉన్నత పాఠశాల పిల్లలు

పిల్లల ప్రాణాలకు ముప్పు



ప్రభుత్వ పాఠశాలకు కేవలం 25 మీటర్ల దూరంలో నడుస్తున్న క్వారీ వల్ల పిల్లల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది. అప్పుడప్పుడూ అక్కడినుంచి రాళ్లు ఎగిరివచ్చి పాఠశాల ఆవరణలో పడుతుంటాయి. కొద్దికాలం క్వారీలో పనులు ఆగాయి కానీ, మళ్లీ ఇటీవల మొదలు పెట్టారు. పాఠశాలకు అత్యంత సమీపంలో క్వారీ నడపడం నిబంధనలకు విరుద్ధం. వెంటనే క్వారీపై చర్యలు తీసుకుని, ఇక్కడ క్వారీయింగ్ ఆపేయాలి.

- నామాలప్ప, ఎంపీటీసీ, సి.బండపల్లె

క్వారీ లీజు రద్దు చేయాలి

మా పిల్లలు చదువుతున్న బడికి దగ్గరగా క్వారీలో పనులు జరుగుతున్నాయి. పర్మిషన్ ఇచ్చారని చెబుతున్నారు కానీ, మాకు ఆ పత్రాలు చూపించడంలేదు. ఒకవేళ పర్మిషన్ ఉన్నాసరే, పిల్లల ప్రాణాలకు ముప్పు ఉండడంవల్ల వెంటనే లీజు రద్దు చేసి, క్వారీని శాశ్వతంగా మూసివేయాలి.

- గ్రామస్థులు, సి.బండపల్లె



స్థానిక సంస్థలకు మంచి రోజులొచ్చాయ్

- దశలవారీగా రిజిస్ట్రేషన్ రుసుం జమ
- మున్సిపాలిటీలు, పంచాయతీలకు ఎంతో ఊరట
- వైసీపీ ప్రభుత్వ హయాంలో మొండిచేయి

స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులను విడుదల చేయడంపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. దాదాపు 20 నెలలుగా పెండింగులో ఉన్న రిజిస్ట్రేషన్ శాఖ స్టాంపుడ్యూటీ సర్‌చార్జీని దశలవారీగా చెల్లించాలని నిర్ణయించింది. జిల్లాకు రూ.35 కోట్ల వరకు రానుంది. ఈ నిర్ణయం స్థానిక సంస్థలకు కొంత ఊరటనిస్తోంది. - చిత్తూరు కలెక్టరేట్

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థలకు రావాల్సిన నిధుల్లో భారీగా కోతలు విధించింది. జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు మండల, జడ్పీలకు జమకావాల్సిన నిధులన్నీ గత ప్రభుత్వమే వాడేసింది. ఆర్థిక సంఘం నిధులనూ లాక్కుని.. చివరన సాధారణ నిధుల్లోనూ కోత విధించింది. దీంతో పంచాయతీల ఖాతాలన్నీ ఖాళీ అయ్యాయి. ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేకపోతున్నామని సర్పంచులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలో టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే.. పంచాయతీరాజ్ శాఖ మంత్రి అయిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్థానిక సంస్థల నిధులపై దృష్టి కేంద్రీకరించారు. పంచాయతీలకు ఇవ్వాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. దీంతో 20 నెలలుగా అపరిష్కృతంగా ఉన్న స్టాంపు డ్యూటీ సర్‌చార్జీలను దశలవారీగా విడుదల చేయాలని ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖకు రెండ్రోజు ల క్రితం ఆదేశాలు జారీచేసింది. దీంతో జిల్లాలోని 697 గ్రామ పంచాయతీలు, ఐదు మున్సిపాలిటీలకు రూ. 35కోట్ల మేర జమ కానున్నాయి. గత ప్రభుత్వంలో 2022 అక్టోబరు వరకే జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ స్టాంపుడ్యూటీ సర్‌చార్జీని చెల్లించింది. 2022 నవంబరు నుంచి గతనెల వరకు చెల్లించలేదు. తాజా నివేదికల మేర ఈ 20 నెలలకు రూ.35 కోట్లు జమచేయాలి. కాగా, పుంగనూరు, పలమనేరు మున్సిపాలిటీల్లో ఉద్యోగులకు జీతాల చెల్లింపులకు కూడా నిధులు లేవని కమిషనర్లు అప్పటి మంత్రి పెద్దిరెడ్డికి మొరపెట్టుకోగా, ఆ రెండు మున్సిపాలిటీలకు మాత్రం పూర్తి స్టాంపు డ్యూటీ సర్‌చార్జి విడుదల చేశారు.

విడతలవారీగా నిధులు జమచేస్తాం



స్థానిక సంస్థలకు బకాయిలున్న స్టాంపు డ్యూటీ సర్‌చార్జీలను దశలవారీగా జమచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. పెండింగ్‌లో ఉన్న నిధులన్నీ ఒకేసారి జమచేయడానికి సాధ్యం కాదు. దశలవారీగా మూడునెలల్లో జమచేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. 2022 నవంబరు నుంచి జమచేయని నిధులను ఖజానా ద్వారా జమచేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాం.

- శ్రీనివాసరావు, జిల్లా రిజిస్ట్రార్, చిత్తూరు

జమ ఎలా చేస్తారంటే...

ఒక మున్సిపాలిటీ లేదా గ్రామ పంచాయతీ పరిధిలో ఉండే ఇల్లు, స్థలం, పంచాయతీ స్థలం, అపార్ట్‌మెంట్ క్రయ విక్రయాలు, సేల్‌డీడ్, గిఫ్ట్‌డీడ్, బదిలీ పేరిట రిజిస్ట్రేషన్లు జరిగితే స్టాంపు డ్యూటీ సర్‌చార్జి స్థానిక సంస్థల ఖాతాలకు జమచేయాలి. ఉదాహరణకు ఒక స్థిరాస్తి రూ.కోటికి విక్రయాలు జరిగితే అందులో 1.5 శాతం అంటే రూ.1.50 లక్షలు ఆస్తి పరిధిలో ఉన్న పంచాయతీ లేదా మున్సిపాలిటీ ఖాతాకు జమచేస్తారు. విక్రయించిన ఆస్తితాలూకు పేర్ల మార్పులు స్థానిక సంస్థలు చేయాలి. స్థానిక సంస్థల చట్టం ప్రకారం ప్రతి రిజిస్ట్రేషన్‌కు కచ్చితంగా నిర్ణయించిన శాతం సర్‌చార్జి స్థానిక సంస్థలకు జమకావాల్సిందే. గత 20 నెలలుగా మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు, మండల, జడ్పీలకు స్టాంపు డ్యూటీ నిధులు జమకాలేదు. ఇప్పుడు దశలవారీగా విడుదల కానున్న సర్‌చార్జి నిధులతో స్థానిక సంస్థలు అనేక అభివృద్ధిపనులు చేసేందుకు వెసులుబాటు లభిస్తుంది.

ఎన్నికల బదిలీపై వెళ్లిన తహసీల్దార్లు వెనక్కి

- ఉద్యోగ విరమణ చేసిన ఎనిమిది మంది స్థానంలో కొత్తవారు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 19: ఎన్నికల సమయంలో బదిలీ అయిన తహసీల్దార్లను సొంత జిల్లాలకు వెళ్లేందుకు అనుమతిస్తూ సీసీఎల్ఏ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సొంత రెవెన్యూ డివిజన్లలోని మండలాలు కేటాయించవద్దని పేర్కొంది. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసి నెలన్నర అయ్యింది. జూన్ చివరిలో తహసీల్దార్లను సొంత జిల్లాలకు బదిలీ చేయాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు విడుదల కాకపోవడంతో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ద్వారా చేసిన ప్రయత్నాలు ఫలించాయి. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మూడేళ్లకు పైగా జిల్లాలో కొనసాగుతున్న 31మంది తహసీల్దార్లను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. జోన్-4 పరిధిలోని అనంతపురం, కర్నూలు, కడప ఉమ్మడి జిల్లాలకు జనవరి 31న బదిలీ చేశారు. అలాగే అనంతపురం నుంచి 11, కర్నూలు నుంచి 13, కడప నుంచి నలుగురు తహసీల్దార్లు చిత్తూరు జిల్లాకు వచ్చారు. కాగా, జిల్లాలో ఆరు నెలల కాలంలో ఎనిమిది మంది తహసీల్దార్లు ఉద్యోగ విరమణ చేశారు. వీరితో కలిపితే 39 మంది తహసీల్దార్లను జిల్లాకు కేటాయించాల్సి ఉంది.

3 ఫిర్యాదులు.. 79 మందిపై కేసులు

- పుంగనూరు ఘటనలో పోలీసుల చర్యలు
- ఎంపీ మిథున్‌సహా 71 మంది వైసీపీ.. ఎనిమిది మంది టీడీపీ శ్రేణులపై కేసుల నమోదు

పుంగనూరు, జూలై 19: పుంగనూరు ఘటనలో రెండు పార్టీల పరస్పర ఫిర్యాదులతో 79 మందిపై కేసులు నమోదయ్యాయి. రెండు ఫిర్యాదులకు సంబంధించి 71 మంది వైసీపీ.. మరో ఫిర్యాదు మేరకు ఎనిమిది మంది టీడీపీవారిపై కేసులు నమోదు చేశారు. ఈ వివరాలను శుక్రవారం సీఐ జయరామయ్య వెల్లడించారు. వైసీపీకి చెందిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి గురువారం పుంగనూరు పట్టణం కొత్తఇండ్లులోని చిత్తూరు మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప ఇంటికి వచ్చారు. దీంతో నేతిగుట్లపల్లె ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని రైతులతో కలిసి టీడీపీ శ్రేణులు అక్కడికి వెళ్లారు. తోపులాట జరిగింది. వైసీపీ శ్రేణుల రాళ్లు, కర్రలు, కుర్చీలు, బాటిళ్లతో దాడులతో 12 మంది టీడీపీ శ్రేణులు, ఒక కానిస్టేబుల్ గాయపడ్డారు. దీంతో ఆగ్రహించిన టీడీపీ శ్రేణులు వాహనాలను ధ్వంసం చేశాయి. ఈ ఘటనకు సంబంధించి టీడీపీ, వైసీపీ శ్రేణులు అర్ధరాత్రి పోలీసులకు ఫిర్యాదులు చేయడంతో ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటి వద్ద ఎంపీ మిథున్‌రెడ్డి తదితరులు టీడీపీ శ్రేణులపై రాళ్లు, కర్రల దాడితో హత్యాయత్నానికి పాల్పడినట్లు గాయపడిన పుంగనూరు టీడీపీ మైనార్టీ నేత సయ్యద్ సుహేల్‌బాషా ఫిర్యాదు ఇచ్చారు. దీనిపై ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప సహా 36 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలపై కేసు నమోదు చేశారు.అలాగే, పుంగనూరు మండలం మేర్లేపల్లెకి చెందిన గాయపడిన టీడీపీ నేత ఏఎస్ఆర్‌కే ప్రసాద్‌స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్పతో కలిసి మొత్తం 35 మందిపై కేసు నమోదైంది. ఇలా వైసీపీకి చెందిన పుంగనూరు, సదుం, పీలేరు, చిన్నగొట్టిగల్లు, కేవీపల్లె, తిరుపతి తదితర ప్రాంతాలకు చెందిన 71 మందిపై హత్యాయత్నం, తదితర కేసులు నమోదయ్యాయి. తన ఇంటిపై దాడి చేసి వాహనాలు ధ్వంసం, దహనం చేశారని మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు తెలుగుదేశం పార్టీకి చెందిన పోలీస్ గిరి, ఎల్.నవీన్, మరో ఆరుగురు నేతలపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఇదో మోసం..!


మహిళల నుంచి ఫిర్యాదు తీసుకుంటున్న ఏఎస్ఐ దామోదరం

- అమాయకుల పేరిట ఫైనాన్స్‌లో వాహనాల కొనుగోళ్లు
- ఆధార్ ఇచ్చినందుకు రూ.5 వేలిచ్చిన ముఠా
- అప్పై కంతులు కట్టకుండానే విక్రయాలు
- ఆధార్‌కార్డుదారులను పట్టుకుంటున్న నిర్వాహకులు
- మోసగాళ్లలో ఒకడు వైసీపీ నేత బంధువు
- పుంగనూరులో పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు

పుంగనూరు, జూలై 19: అమాయకులు.. డబ్బు అవసరమున్న నిరుపేదలను టార్గెట్ చేశారు. ఆధార్ కార్డు ఇస్తే చాలు మేము ఫైనాన్సులో వాహనం కొనుక్కుంటామని.. మీకు ఇబ్బంది లేకుండా కంతులు కట్టుకుంటామని చెప్పారు. ఆధార్ ఇచ్చిన వారికి రూ.5 వేలు ఇచ్చారు. వారి పేర్లతో వాహనాలు, వస్తువులు కొన్న ఈ ముఠా.. కంతులు చెల్లించకుండా ఇతరులకు విక్రయించేసింది. ఫైనాన్సు సంస్థ నిర్వాహకులు ఇప్పుడు ఆధార్‌కార్డుదారులను వెతుక్కుంటూ వచ్చి మిగిలిన కంతులు కట్టాలని నిలదీస్తున్నారు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ తరహా మోసం పుంగనూరులో వెలుగు చూసింది. పట్టణంలోని కుమ్మరవీధి, కొత్తపేట, రహ్మత్‌నగర్‌కు చెందిన ముస్లిం యువకులు ఇమ్రాన్, ఇర్ఫార్, సుల్తాన్ (అడ్డు) ఒక ముఠాగా ఏర్పడ్డారు. ఏడాదిగా ఉబేదుల్లా కాంపౌండ్, రహ్మత్‌నగర్ తదితర ప్రాంతాల్లోని మహిళల వద్దకు వెళ్లి 'మీరు కేవలం ఆధార్‌కార్డులు ఇస్తే చాలు. మేము ఫైనాన్సులో ద్విచక్రవాహనాలు తీసుకుంటాం. మీకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కంతులవారీగా అప్పుతీర్చేస్తాం' అంటూ నమ్మించారు. ఆధార్ కార్డు జిరాక్స్ ఇచ్చిన మహిళలకు రూ.5 వేలు అందించి మీకు ఎలాంటి ఇబ్బంది ఉండదని చెప్పారు. ఇలా వివిధ ఫైనాన్స్ కంపెనీల వద్దకు అమాయకులను తీసుకెళ్లి వారి పేరుతో ద్విచక్ర వాహనాలు, మొబైల్‌ఫోన్లు తదితర వస్తువులను నామమాత్రపు డిపాజిట్ చెల్లించి తీసుకున్నారు. వటిని కొంత చౌకగా ఇతర ప్రాంతాల్లో విక్రయించి వచ్చిన వరకూ డబ్బులు తీసుకున్నారు. పుంగనూరులో దాదాపు 80 మంది ఆధార్‌కార్డుల ద్వారా కోట్ల రూపాయల విలువ చేసే దాదాపు 150 వాహనాలు కొనుగోలు చేసి ఇతర ప్రాంతాల్లో విక్రయించినట్లు సమాచారం. ఈ ముఠాలోని ఓ యువకుడికి వైసీపీకి చెందిన రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మాజీ ఛైర్మన్ ఖాదర్‌బాషా సమీప బంధువు కావడంతో పేదలు, అమాయకులకు ఇంటి పట్టాలు, హౌసింగ్ ఇళ్లు, ఇతర రుణాలు ఇప్పించి సహాయం చేస్తామని నమ్మించడంతో అమాయకులు ఏమాత్రం ఆలోచించకుండా ఆధార్‌కార్డులిచ్చేశారు. నెల రోజులుగా ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ వారు ఆధార్‌కార్డులు ద్వారా వాహనాలు తీసుకున్న వారి ఇళ్ల వద్దకు వచ్చి మీరు ఈఎంఐ కంతులు కట్టడం లేదని, మీ వాహనాన్ని తమకు అప్పగించాలని, లేకుంటే అప్పు తీర్చాలని, లేదంటే కేసు పెడుతామని ఒత్తిడి చేస్తున్నారు. గతంలో చిల్లర డబ్బులను ఆశపడి ఆధార్‌కార్డులు ఇచ్చి సమస్యల్లో చిక్కుకున్న బాధితులు బ్రోకర్ల ఇళ్ల వద్దకు వెళ్లి అన్యాయంగా తమను ఇరికించారని, ఈసమస్య తీరేలా వాహనాలు ఫైనాన్స్ కంపెనీకి ఇవ్వడమో.. పెండింగ్ ఈఎంఐలు కట్టడమో చేయాలని కోరినా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో బాధితులు ఒక్కొక్కరుగా వీరి మోసాన్ని గుర్తించి స్థానిక తెలుగుదేశం పార్టీ నేతల ద్వారా సీఐ జయరామయ్య, ఏఎస్ఐ దామోదరానికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. గత కొద్దిరోజులుగా పట్టణంలో ఈవిషయం వెలుగుచూడటంతో ముగ్గురు యువకులు పరారీలో ఉన్నట్లు తెలిసింది. బాధిత మహిళల ఫిర్యాదులపై విచారించి తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

28 వరకు 144 సెక్షన్

పుంగనూరులో దాడుల నేపథ్యంలో శుక్రవారం నుంచి ఈనెల 28వ తేది వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. పుంగనూరు అసెంబ్లీ నియోజకవర్గంలో అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, ముగ్గురి కంటే ఎక్కువ జనం గమికూడరాదని జిల్లా మేజిస్ట్రేట్ సుమిత్ కుమార్ 144 సెక్షన్ అమలులో ఉంటుందని, రాజకీయపార్టీలు, ప్రజలు సహకరించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులను జిల్లా ఎస్పీ, పుంగనూరు తహసీల్దార్, పుంగనూరు సీఐలకు పంపారు.

ఆరు మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 19: జిల్లా వ్యాప్తంగా గడచిన 24 గంటల్లో ఆరు మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షపాతం నమోదైంది. కుప్పంలో 24.0, గుడుపల్లి 12.4, రామకుప్పం 7.8, శాంతిపురం 4.2, వి.కోట 2.6, చిత్తూరు అర్బన్‌లో 1.4 మి.మీ వర్షం కురిసింది.

తెలుగు కవిత్వంలో నిలువెత్తు సంతకం

అడిగోపుల వెంకటరత్నంకు నివాళి



తెలుగు సాహితీ లోకానికి తీరని వెలితిని మిగిల్చి ప్రసిద్ధ కవి అడిగోపుల వెంకటరత్నం శుక్రవారం తిరుపతిలో కన్ను మూశారు. దళిత స్పృహ, అభ్యుదయ భావజాలంతో యాభై ఏళ్లుగా ఆయన నిరంతరాయంగా కవిత్వం రాశారు. ఆయన కవిత్వం అచ్చుకాని పత్రిక ఏదీ తెలుగు నేలమీద లేదంటే అతిశయోక్తి కాదు. ప్రతి పరిణామాన్నీ నిశితంగా గమనిస్తూ కవిత్వ రూపంలో స్పందించడం ఆయన ప్రత్యేకత.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు)

నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం కొత్తవంగల్లు అడిగోపుల వెంకటరత్నం పుట్టిన ఊరు. నాగార్జున యూనివర్సిటీలో ఇంజనీరుగా చేస్తూనే కవిత్వం విరివిగా రాసేవారు. రిటైరయ్యాక తిరుపతిలో స్థిరపడ్డారు. భార్య పద్మజ, కుమార్తెలు మాధవి, శాంతి, కుమారుడు శ్రీకాంత్ ఉన్నారు.విదేశాల్లో ఉన్న కుటుంబ సభ్యులు వచ్చాక ఆయన చివరి కోరిక ప్రకారం స్వస్థలం కొత్తవంగల్లులో ఆదివారం అంత్యక్రియలు నిర్వహిస్తారు.

అడిగోపుల కవితా సంపుటాలు

సూర్యోదయం, ఎన్నాళ్లీ చరిత్ర, పురోగతి అంచున, జీవన పోరాటం, బానిసత్వం అమ్మబడును, మరణానికి రెండు ముఖాలు, విప్లవానికి పురిటిగది, ఆకాశవీధిలో అగ్నిగానం, యుద్ధమంటే మాకు భయం లేదు, మట్టి మౌనం వహించదు, మహాపథం, రాతి చిగుళ్ళు, అదృశ్యకుడ్యం, సంకెళ్ళు తెగిన చప్పుళ్ళు, శ్వేతపత్రం, విశ్వగీతం, రంగుల చీకటి, రేపటి వర్తమానం, రెక్కవిప్పిన రాగం, రేపటి జ్ఞాపకం, ముందడుగు, పదండి ముందుకు, కాలం నా చేతిలో ఉంది, జయభేరి, కొత్తగాలి, నిలువెత్తు సంతకం.



అందుకున్న అవార్డులు

కుందుర్తి పురస్కారం, శ్రీశ్రీ అవార్డు, తానా అవార్డు, కరుణశ్రీ అవార్డు, వాసిరెడ్డి - సుంకర అవార్డు, తెలుగు వర్సిటీ పురస్కారం, రాష్ట్ర ప్రభుత్వ కవిరత్న అవార్డు, రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం, గిడుగు పురస్కారం, నూతలపాటి కవితా పురస్కారం, కొలకలూరి భాగీరథి పురస్కారం, ఉమ్మడిశెట్టి పురస్కారం, గార్లపాటి సిద్ధమనాయుడు పురస్కారం, విశాలాక్షి సాహిత్య పురస్కారం.

"నిన్నటి మొన్నటి జ్ఞాపకం.. వర్తమానంలో ఉంటుంది.. నేటి జ్ఞాపకం, రేపటి జ్ఞాపకం.. భవిష్యత్తులో ఉంటుంది... నా అంటరానితనం దూరంగా కూర్చొన్న జ్ఞాపకం.. ఇది గతం. రేపు నేను మరణించాక అంటరానితనం వెంటబడి ఊరిదారి అనుమతించక ఊరిబయటే ఉంటుంది... నా శవప్రస్థానం... నా రేపటి జ్ఞాపకం కాకూడదు." అని తన కవిత్వంలో విస్పష్టంగా ప్రకటించిన కవి అడిగోపుల వెంకటరత్నం. "మల్లెచెట్టు కింద మల్లెతీగలం.. ఎదుగూ బొదుగూ లేని వాళ్లం.." అంటూ తెలుగు కవిత్వంలో దళిత జీవితంలోని దైన్యాన్ని అనేక దశాబ్దాల క్రితమే వినిపించిన కవి ఈయన. ఆరుద్ర, ఆత్రేయ, రావూరి భరద్వాజ, సినారె, రాచపాళెం, సంజీవ్‌దేవ్, గుంటూరు శేషేంద్రశర్మ, పెద్దిబొట్ల సుబ్బరామయ్య, రావిశాస్త్రి, వంటి ప్రముఖుల చేత ప్రశంసలు పొందిన కవి అడిగోపుల వెంకటరత్నం. కుమారుడు శ్రీకాంత్ చిత్రకారుడిగా గుర్తింపు పొందారు. అడిగోపుల కవితా సంపుటాలకు కుమారుడు రూపొందించిన చిత్రాలనే ముఖచిత్రాలుగా ముద్రించుకున్నారు. అడిగోపుల కవిత్వంపై శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ తెలుగు విభాగంలో ఎన్. భీమన్న పరిశోధన చేశారు. ఆంధ్రా యూనివర్సిటీలో పద్మకుమారి పరిశోధన చేశారు. నాగార్జున యూనివర్సిటీలో అడిగోపుల కథలపై త్రివిక్రమ సూరి ఎంఫిల్ చేశారు.

నానీకి మా పెద్దిరెడ్డే గాడ్‌ఫాదర్

- వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆయనకు వెన్నెముకలా నిలిచారు
- టీడీపీ ఎమ్మెల్యే నానిపై చెవిరెడ్డి సంచలన ఆరోపణలు

తిరుపతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీకి వైసీపీ పాలనలో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెన్నెముకలా అండగా నిలిచారని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. శుక్రవారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'పులివర్తి నానీకి మా పార్టీ ముఖ్యనేత పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డే గాడ్ ఫాదర్' అని వ్యాఖ్యానించారు. అందుకే తాము అధికారంలో ఉన్న ఐదేళ్ల నాని క్వారీలు ఒక్క గంటైనా మూయలేదని చెప్పారు. ఆయన ట్రాన్స్‌పోర్ట్ కంపెనీని ఆపలేదు. నిబంధనలు పాటించకపోయినా స్టోన్ పాలిషింగ్ పరిశ్రమ జోలికెళ్లలేదని వివరించారు. నిబంధనలు పాటించకపోయినా సంబంధిత శాఖ మంత్రిగా పెద్దిరెడ్డి చర్యలు తీసుకుకోకపోగా, పాతమైనింగ్ కొనసాగిస్తూ అదనంగా మూడు హెక్టార్లు ఇచ్చారని చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఆరోపించారు. 'మా పార్టీ నేత ఎమ్మార్సీ రెడ్డిని వైసీపీ నుంచి సస్పెండ్ చేస్తే మావాళ్లెవరూ ఖండించలేదు కానీ, నాని ప్రెస్‌మీట్ పెట్టి మరీ ఖండించారు' అని గుర్తుచేశారు. వైసీపీతో ఆయనకు లోపాయికారీ ఒప్పందం ఏస్థాయిలో ఉందో వెల్లడవుతోందని అన్నారు. అదేవిధంగా పెద్దిరెడ్డికి అత్యంత సన్నిహితుడిగా ఉన్న సీఆర్ రాజన్, ఎన్నికల ముందు టీడీపీలో చేరి, నెల రోజులకే చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడి పదవిని పొందారు. మా పెద్దిరెడ్డి సన్నిహితుడికి పార్టీ పగ్గాలు అప్పగించి వైసీపీ నేతపై ఉన్న కృతజ్ఞతను నాని చాటుకున్నారని అన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో నాని అరాచకాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. 'ఎంతమందిపై దాడిచేస్తారో చేయండి. వడ్డీతోపాటు చెల్లిస్తా..' అని చెవిరెడ్డి హెచ్చరించారు.

చెవిరెడ్డీ.. డైవర్షన్ పాలిటిక్స్ మానుకో..!

- పెద్దిరెడ్డితో మాకు ఎలాంటి సంబంధాలు లేవు
- అవసరమైతే కాణిపాకంలో ప్రమాణం చేస్తా
- నా కార్యకర్తల జోలికొస్తే ఊరుకునేది లేదు
- చెవిరెడ్డిని రాజకీయ సమాధి చేస్తా
- చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆగ్రహం

తిరుపతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి):'మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డితో మాకు ఎలాంటి లావాదేవీలు లేవు. యాదృచ్ఛికంగా రెండేసార్లు ఎయిర్‌పోర్టులో కలసినప్పుడు పలకరించడం తప్ప. నేను కానీ నా కుటుంబసభ్యులు కానీ ఆయనకు ఫోన్ చేసినా, కలిసి మాట్లాడినట్టు నిరూపించినా కాణిపాకంలో ప్రమాణం చేస్తా. చెవిరెడ్డీ..డైవర్షన్ పాలిటిక్స్ మానుకో' అంటూ చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నాని స్పష్టం చేశారు. పులివర్తినానీపై చెవిరెడ్డి మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మెల్యే నాని ఘాటుగా ప్రతిస్పందించారు. 'పెద్దిరెడ్డితో తన భార్య కుటుంబానికి బంధుత్వం ఉన్నమాట వాస్తవమేనంటూ.. ఎర్రావారిపాళెం కరుణాకర్‌రెడ్డి ఇరు కుటుంబాలకు బంధువైనా తమకు వ్యతిరేకంగా పనిచేశారని తెలిపారు. 'మా కార్యకర్తలపై మీరు దాడులు చేశారు. రాజకీయంగా ఎదిగే నాలాంటి వ్యక్తిపై నిందలు వేయద్దు. నిన్ను రాజకీయ సమాధి చేసేవరకు నేను బతికే ఉంటా.' అంటూ తీవ్రస్వరంతో హెచ్చరించారు. 'నేను గెలిచిన తర్వాత శ్రీవారికి మొక్కుబడి తీర్చుకోలేని పరిస్థితి నీవల్లే వచ్చింది. నా ఆరోగ్యం సహకరించక నడిచివెళ్లలేక పోయా. నటించాల్సిన అవసరం లేదు. ఇప్పటికీ నాకాలు వాపు తగ్గలేదు. నా కార్యకర్తలను వాడు, వీడు అని మాట్లాడితే సహనం కోల్పోవాల్సి వస్తుంది. నా కార్యకర్తలు దేవుళ్లతో సమానం. మీ కార్యకర్తలను కూడా నేను గౌరవిస్తా. ఉన్నది లేనట్టుగా.. లేనిది ఉన్నట్టుగా మాట్లాడవద్దు' అన్నారు. దొంగ ఓట్లు అంశం, తమపై దాడి ఘటనలపై విచారణ జరిపించి తీరుతామని స్పష్టం చేశారు. తన క్వారీలకు రూ.49.5లక్షలు డిమాండు నోటీసు ఇచ్చారని, ఫ్యాక్టరీలకు నోటీసులు ఇచ్చారని, హైకోర్టుకెళ్లి ఇంటీరియం ఆర్డర్ తెచ్చుకున్నానని నాని వివరించారు. 'పెద్దిరెడ్డి కాదు కదా ఏ రెడ్డి కాళ్లూ నేను పట్టుకోను. కేవీఎస్ పేరుతో బోగస్ ట్రస్టు పెట్టి తప్పుడు లెక్కలు రాసి దోచేస్తున్నావు. కోవిడ్ సమయంలో పంపకాల ముసుగులో మఠం భూములు నొక్కేశావు' అని ఆరోపించారు. 'సీఆర్ రాజన్.. పెద్దిరెడ్డి మనిషని చెబుతున్నావు. మీతో నచ్చకనే ఆయన మా పార్టీలో చేరారు' అన్నారు.



తన కాలు వాపు ఇంకా తగ్గలేదని మీడియాకు చూపుతున్న పులివర్తి నాని

వానరాన్ని కాపాడి.. మానవత్వం చాటుకొని..!



కుక్కల దాడిలో గాయపడిన వానరానికి చికిత్స చేస్తున్న పశువైద్య సిబ్బంది

పలమనేరు, జూలై 19: పలమనేరుకు చెందిన సామాజిక కార్యకర్త మధుమోహన్‌రావు శుక్రవారం కుక్కల బారి నుంచి కాపాడి మానవత్వం చాటుకొన్నారు. పట్టణంలోని లక్ష్మీనగర్ ప్రాంతంలో ఉదయం రోడ్డుపైకి వచ్చిన ఒక వానరాన్ని వీధికుక్కలు చుట్టుముట్టాయి. సమీపంలోనే అటుగా వెళ్తున్న మధుమోహన్‌రావు ఆ వీధికుక్కలను తరిమివేశారు. అప్పటికే వీధికుక్కలు వానరాన్ని కరిచి తీవ్రంగా గాయపరిచాయి. వెంటనే ఆయన గాయపడిన వానరాన్ని తన ఇంటికి తీసుకు వెళ్లి వానరానికి కొంత ఆహారాన్ని అందించారు. అనంతరం పశువైద్యశాలకు వెళ్లి అక్కడి సిబ్బందికి విషయాన్ని వివరించారు. వారిని వెంటబెట్టుకుని, మందులను తీసుకొచ్చి వానరానికి చికిత్స చేయించారు.

జర్నలిస్టు హెల్త్‌స్కీమ్ గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 19: వర్కింగ్ జర్నలిస్టు హెల్త్‌స్కీమ్ పథకాన్ని 2024-25 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్, డీఎంఏసీ చైర్మన్ సుమిత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. www.cfms.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా రూ.1,250 చెల్లించి 2025 మార్చి 31వ తేదీ వరకు లబ్ధి పొందాలని కోరారు. ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజినల్ చలానా, అక్రిడిటేషన్ జిరాక్స్, హెల్త్‌స్కీమ్ దరఖాస్తు, కుటుంబ సభ్యుల ఫొటోలు, ఆధార్ కార్డుల కాపీలను కలెక్టరేట్‌లోని జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో పనివేళల్లో అందజేయాలని కోరారు. హెల్త్ స్కీము ద్వారా పొందే వైద్యసేవల విషయంలో ఎలాంటి ఆదాయ పరిమితులూ లేవని, ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పేద విద్యార్థులకు సాయం అభినందనీయం



విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

బంగారుపాళ్యం, జూలై 19: పేద విద్యార్థులకు దాతల సాయం శ్లాఘనీయమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. శుక్రవారం బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జీఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఈశ్వర్ నాయుడు, ఎన్ఆర్ఐ కళ్యాణ్‌ల ఆధ్వర్యంలో అభయం ట్రస్టు ద్వారా విద్యా సామగ్రిని ఎమ్మెల్యే మురళీమోహన్ చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈశ్వర్‌నాయుడు మాట్లాడుతూ ఏడేళ్లుగా తమ ట్రస్టు ద్వారా పేద విద్యార్థులకు సాయం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి ధరణి, జనార్దన్ గౌడ్, మోహన్ నాయుడు, ఎంఈవోలు నాగేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను పరిశ్రమల హబ్‌గా తీర్చిదిద్దుతాం

చిత్తూరు సిటీ, జూలై19: జిల్లాను పరిశ్రమల హబ్‌గా తీర్చిదిద్దుతామని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అధికారులతో మాట్లాడి జిల్లాలో చిన్న, మధ్య, పెద్ద తరహా పరిశ్రమలను నెలకొల్పేందుకు కావాల్సిన మార్గాలను అన్వేషిస్తున్నామని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నామని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఎంఎస్‌ఎంఈలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని ఎంపీ తెలిపారు.

సౌకర్యాలెలా ఉన్నాయ్?

శ్రీవారి భక్తులతో ముచ్చటించిన హోంమంత్రి అనిత



తిరుమల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సౌకర్యాలెలా ఉన్నాయంటూ తిరుమలలో శ్రీవారి భక్తులతో హోంమంత్రి అనిత ముచ్చటించారు. కాలినడకన శుక్రవారం తిరుమలకు చేరుకున్న ఆమె క్షేత్రసంప్రదాయాన్ని పాటిస్తూ ముందుగా వరాహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధుల్లో ప్రదక్షిణ చేశారు. ఈసందర్భంగా అక్కడున్న భక్తులను పలుకరించారు. ఎక్కడి నుంచి వచ్చారు, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అంటూ కొంతసేపు వారితో మాట్లాడారు.

వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా జేవీ రమణ



తిరుపతి రూరల్, జూలై19: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా వర్సిటీ డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ డాక్టర్ జేవీ రమణను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. పశుసంవర్ధకశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ ఈమేరకు పేర్కొన్నారు. 1991లో అఖిల భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలిలో సైంటిస్ట్‌గా కెరీర్ ప్రారంభించిన రమణ.. 2001లో వెటర్నరీ వర్సిటీలో యానిమల్ న్యూట్రిషన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. 2007లో ప్రొఫెసర్‌గా, 2016 నుంచి ఐదేళ్లపాటు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా పనిచేశారు. 2022 అక్టోబరు నుంచి రెండో దఫా డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్‌గా నియమితులై కొనసాగుతున్నారు. వీసీగా శనివారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

లేబర్ డీసీ బాలు నాయక్‌కు జాయింట్ కమిషనర్‌గా పదోన్నతి



తిరుపతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎం.బాలు నాయక్‌కు రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ కమిషనర్‌గా పదోన్నతి కల్పించింది. రాష్ట్ర వ్యాప్తంగా ముగ్గురు డిప్యూటీ కమిషనర్లకు పదోన్నతి లభించగా వారిలో బాలు నాయక్ కూడా ఉన్నారు. పదోన్నతిపై ఆయన్ను ప్రభుత్వం జాయింట్ కమిషనర్‌గా కర్నూలుకు బదిలీ చేసింది. ఈ మేరకు సంబంధిత శాఖ ముఖ్య కార్యదర్శి ఎంఎం నాయక్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఒక్కొక్కరిది ఒక్కో విషాదం

రోడ్డు ప్రమాదంలో ఎస్టీకాలనీకి చెందిన ముగ్గురి దుర్మరణం



జయచంద్ర మృతదేహం వద్ద కుటుంబీకులు

ఐరాల, జూలై 19: ఒకే కాలనీకి చెందిన ముగ్గురు గురువారం రాత్రి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఈ ఘటనతో ఎస్టీకాలనీలో విషాదం నెలకొంది. ముగ్గురి కుటుంబాలవీ ఒక్కో విషాదం. మృతులు.. ఐరాల మండలం వేదగిరివారిపల్లె పంచాయతీ రామతీర్థ సేవాశ్రమం ఎస్టీ కాలనీకి చెందిన జయచంద్ర(38), నారాయణ(35), నాగేంద్ర(14). రోడ్డు ప్రమాదం జరిగింది.. తిరుపతి జిల్లా పాకాల మండలం సప్తకనికలమ్మ ఆలయం వద్ద. ఎస్టీ కాలనీకి చెందిన ఈ ముగ్గురు సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో దామలచెరువుకు వెళ్తుండగా అక్కగార్ల ఆలయం వద్ద అదుపుతప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందగా మనోజ్ గాయపడ్డాడు. స్థానికులు మనోజ్‌ను 108 ద్వారా కొత్తకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతులకు శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబ పెద్దల మృతితో ఆ కుటుంబాలు దిక్కులేనివయ్యాయి. జయచంద్రకు ఐదుగురు పిల్లలు. ఇందులో ఒకరు మృతి చెందగా ప్రస్తుతం అతని భార్య గర్భిణి. కూలికి వెళితేగాని పూటగడవని స్థితి. జయచంద్ర మృతితో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నారాయణకు ఇద్దరు పిల్లలున్నారు. నాగేంద్రకు ఇంకా పెళ్లి కాలేదు. చేతికి అందిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. మృతుల కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి.

23 నుంచి నారా భువనేశ్వరి కుప్పం పర్యటన

కుప్పం, జూలై 19: ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి కుప్పం పర్యటన ఖరారైంది. ఈనెల 23 నుంచి నాలుగురోజులపాటు ఆమె కుప్పంలో పర్యటించనున్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు ప్రతాప్, శాంతారాం తదితరులు ఆమె పర్యటన షెడ్యూల్‌ను శుక్రవారం విడుదల చేశారు. 23వ తేదీ మధ్యాహ్నం గుడుపల్లె మండలం కమ్మగుట్టపల్లె చేరుకుని మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం కంచిబందార్లపల్లెలోనూ గ్రామీణ మహిళలతో సమావేశమై వారి సాదకబాధకాలు తెలుసుకుంటారు. గుట్టపల్లె, కోటపల్లె గ్రామాలలో మహిళలతో ముఖాముఖిలో పాల్గొంటారు. రాత్రికి పీఈఎస్ గెస్ట్‌హౌస్‌లో బస చేస్తారు. 24న ఉదయం కుప్పంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం కుప్పం మండలం ఎన్.కొత్తపల్లె, నడిమూరు, పైపాళ్యం, ఉర్లవోబనపల్లె, గుడ్లనాయనిపల్లె గ్రామాలను సందర్శించి ఆయా గ్రామాలలో మహిళలతో ముఖాముఖి సమావేశమవుతారు. సాయంత్రం కుప్పం చేరుకుని టీడీపీ నాయకులు, కో-ఆర్డినేటింగ్ కమిటీతో సమావేశమవుతారు. 25వ తేది ఉదయం శాంతిపురం మండలం సోమాపురం, కర్లగట్ట, బడుగుమాకులపల్లె, రామకుప్పం మండలం ఆవులకుప్పం, నారాయణపురం తాండా, ఆరిమానుపెంట, వీర్నమల గ్రామాలను సందర్శించి అక్కడి మహిళలతో ముఖాముఖి నిర్వహిస్తారు. 26న శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ శివపురం వద్ద తమ సొంతింటి నిర్మాణాన్ని పరిశీలిస్తారు. అనంతరం పీఈఎస్ ఆడిటోరియంలో 10.30 గంటలకు మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీలో పాల్గొంటారు.

వైసీపీ నేత ఇసుక డంప్ సీజ్





పోలీసులు సీజ్ చేసిన ఇసుక డంపు, పోలీస్ స్టేషన్ వద్ద ట్రాక్టరు

శాంతిపురం, జులై 19: వైసీపీ నేత అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్ శుక్రవారం సీజ్ చేశారు. శాంతిపురం మండలం నాయనపల్లెకు చెందిన వైసీపీ నేత కృష్ణమూర్తి 70 లోడ్ల ఇసుకను గ్రామ సమీపంలోని నర్సరీ వద్ద నిల్వ చేశారు. ఈ ఇసుకను వేరేచోటుకు తరలిస్తుండగా తన సిబ్బందితో వెళ్లి ఎస్ఐ సీజ్ చేశారు. ఒక ఎక్స్‌కవేటర్, రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇసుకను తహసీల్దార్ మురళీకృష్ణకు అప్పగించారు. కృష్ణమూర్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి జయప్ప, వీఆర్వో రాజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొలాల్లో ఇసుక డంప్‌లు

పలమనేరు, జూలై19 : పలమనేరు మండలం పెంగరగుంట, ముసలిమడుగు గ్రామాలకు చెందిన పొలాల్లో వారం రోజుల వ్యవధిలో పలుచోట్ల ఇసుక డంప్‌లు కనిపిస్తున్నాయి. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన ఎస్‌ఈబీ అధికారులు, రెవెన్యూ, భూగర్భ జలవనరుల శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ నిల్వలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.





పెంగరగుంట, ముసలిమడుగు వద్ద నిల్వచేసిన ఇసుక

కల్లూరులో గట్టి బందోబస్తు

- ఎంపీ మిథున్‌రెడ్డి సదుం వెళ్తుండటంతో పోలీసుల ముందు జాగ్రత్త చర్యలు



కల్లూరు, జూలై 19: పులిచెర్ల మండలం కల్లూరు నాలుగురోడ్ల కూడలిలో శుక్రవారం అడిషనల్ ఎస్పీ ఆరీఫుల్లా ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నారు. శుక్రవారం ఎంపీ మిథున్‌రెడ్డి కల్లూరు మీదుగా సదుం బయలుదేరారు. గురువారంనాటి పుంగనూరు ఘటన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. కల్లూరు నాలుగురోడ్ల కూడలికి చేరుకున్నారు. టీడీపీ శ్రేణులు రోడ్లపైకి వచ్చి నిరసన చేపట్టకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. పోలీసులు ఉదయం 8 గంటలకే కల్లూరు నాలుగురోడ్ల కూడలిపైకి పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో ఏమి జరుగుతోందో అర్థంకాక ప్రజలు ఒక్క సారిగా ఆందోళన చెందారు. అయితే ఎంపీ మిథున్‌రెడ్డి ఉదయం 11.13 గంటలకు కల్లూరు మీదుగా సదుం వెళ్లడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ బందోబస్తులో డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సీఐలు శ్రీనివాసులు, కుళ్లాయప్ప, విశ్వనాథరెడ్డి, ఎస్ఐలు రవిప్రకాష్‌రెడ్డి, రమేష్, ఉమామహేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ద్రావిడ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ బాధ్యతల స్వీకరణ


వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆచార్య దొరస్వామి

గుడుపల్లె, జూలై 19: ద్రావిడ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉప కులపతిగా ఆచార్య దొరస్వామి శుక్రవారం విశ్వ విద్యాలయం పరిపాలన భవనంలో బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు వీసీగా ఉన్న ఆచార్య మధుజ్యోతి తన పదవికి రాజీనామా చేయడంతో ద్రావిడ వర్సిటీలోని గ్రంథాలయ శాఖలో ఆచార్యులుగా పనిచేస్తున్న దొరస్వామిని ఇన్‌చార్జి వీసీగా నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆచార్య దొరస్వామికి ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మాధవ నాయుడు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తనపై నమ్మకంతో వీసీగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. విశ్వవిద్యాలయం అభివృద్ధికి అధికారులు, ఉద్యోగుల సహకారంతో శక్తి వంచన లేకుండా కృషిచేస్తానని తెలిపారు. వర్సిటీ ఇన్‌చార్జి వీసీని అధ్యాపకులు, ఉద్యోగులు, పరిశోధకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షేమ హాస్టళ్లలో ఎమ్మెల్సీ తనిఖీలు


విద్యార్థులకు దుప్పట్లు, పరుపులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, జూలై 19: కుప్పంలోని బీసీ, ఎస్సీ సంక్షేమ వసతి గృహాలను గురువారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తనిఖీ చేశారు. వసతి, ఆహారం నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఫ్యాన్లు పనిచేయక పోవడం, విద్యుత్తు బల్బులు చాలకపోవడం వంటివి గమనించారు. ఆయా సౌకర్యాలను కల్పించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు దుప్పట్లు, పరుపులు, దిండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ భవనాలు శిథిల స్థితిలో ఉన్నందున వీటిని పడగొట్టి త్వరలోనే నూతన భవనాలు నిర్మించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మునస్వామిపురం ప్రాంతంలోని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నాయకుడు సత్యేంద్రశేఖర్, హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి పరీక్ష శిబిరం

కుప్పం, జూలై 19: సాయిమాతా సేవాట్రస్టు ఆధ్వర్యంలో, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి వారు, ఈనెల 21వ తేదీన కుప్పంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు సాయిమాతా సేవాట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. కుప్పం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించే ఈ శిబిరంలో కంటి పరీక్షలు జరిపి అవసరమైన ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తామన్నారు.

గోడిగడ్డల చెరువు ఆక్రమణలపై రెవెన్యూ సర్వే

కుప్పం రూరల్, జూలై 19: కుప్పం మండలం మల్లానూరు పంచాయతీ పొన్నాంగూరు గ్రామానికి చెందిన గోడిగడ్డల చెరువు ఆక్రమణలపై రెవెన్యూ యంత్రాంగం సర్వే చేపట్టింది. ఈ చెరువును వైసీపీ మండల కన్వీనర్ హెచ్‌ఎం.మురుగేశ్ ఆక్రమించారని, ప్రజా ఫిర్యాదుల వేదికలో గ్రామస్థులు కొందరు కలెక్టర్ సుమిత్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు వీఆర్వో హంసగిరి సర్వే మొదలు పెట్టారు. దీనిపై తహసీల్దారు హరి కుమార్ మాట్లాడుతూ ఆక్రమణ జరిగివుంటే స్వాధీనం చేసుకుంటామని చెప్పారు.

నేత్ర పర్వంగా సీతారాముల కల్యాణోత్సవం



రామకుప్పం, జులై 19 : రామకుప్పం మండలం చెల్లిగానిపల్లెలో తొలిఏకాదశి వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి సీతారాముల కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. రాత్రి 8 గంటలకు వేదపండితులు నాగరాజు శర్మ ఆధ్వర్యంలో పురోహితులు సర్వాలంకార భూషితంగా అలంకరించిన సీతా, రాములు, లక్ష్మణ, హనుమంతుల ఉత్సవమూర్తులను వివాహ వేదికపై అధిష్ఠింపజేశారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల మధ్య పండితులు మాంగళ్య ధారణ తంతును నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి కళ్యాణోత్సవాన్ని తిలకించారు.

ఉర్దూ ఉన్నత పాఠశాలలో సమస్యలు పరిష్కరిస్తాం

రామకుప్పం, జులై 19 : రామకుప్పంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఉన్న సమస్యలను సీఎం చంద్రబాబు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు అంజనయరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మెన్ సీతాపతి తెలిపారు. శుక్రవారం వారు పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనారిటీ సెల్ జిల్లా కార్యదర్శి సలాం సాబ్, క్లస్టర్ ఇన్‌చార్జి మహ్మద్ రఫీ, నేతలు ఆదిల్, నియాజ్, మంజునాథ్, అక్బర్, హనీఫ్ సాబ్ పాల్గొన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం


బైపరెడ్లపల్లెలో మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేస్తున్న చలపతి

రామకుప్పం, జులై 19 : రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తుందని తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నరసింహులు తెలిపారు. శుక్రవారం వారు రామకుప్పం మండలం బైపరెడ్లపల్లె గ్రామంలో రైతులకు సబ్సిడీ మొక్కజొన్న, పశుగ్రాసం విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేష్, నాయకులు నరేంద్రరెడ్డి, ఆదిల్, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ సాగిన కోదండరామాలయ భూముల సర్వే

రామకుప్పం, జూలై 19: రామకుప్పంలోని కోదండరామస్వామి ఆలయ భూముల సర్వే రెండో రోజూ సాగింది. తహసీల్దారు శ్రీధర్ ఆధ్వర్యంలో సర్వేయర్లు, రెవిన్యూ సిబ్బంది శుక్రవారం పొద్దుపోయే సరికి తిమ్మసముద్రం రెవిన్యూలో కోదండరామాలయానికి 118ఎకరాల భూములున్నట్టు తేల్చారు. ఆ భూముల సరిహద్దుల్లో సర్వే రాళ్లను ఏర్పాటు చేశారు. శనివారం రామకుప్పం రెవిన్యూలోని భూముల సర్వే చేస్తామని అధికారులు తెలిపారు.

ముమ్మరంగా మామిడి కొమ్మల కత్తిరింపులు



సోమల, జూలై 19: మండలంలో మామిడి సీజన్ ముగియడంతో తోటల్లో కొమ్మల కత్తిరింపులకు రైతులు శ్రీకారం చుట్టారు. కొమ్మల కత్తిరించడానికి నిపుణులైన కూలీలు అవసరం ఉండడంతో వారికి డిమాండ్ పెరిగింది. వారికి రోజు కూలి రూ.700వరకు చెల్లించాల్సి వస్తోంది. సోమల మండలంలోనే 5వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. కొమ్మల కత్తిరింపు కూలీలకు మరో రెండు నెలలు డిమాండ్ ఉంటుంది. కొమ్మ కత్తిరింపులు పూర్తయ్యాక తోటల్లో దుక్కులు చేస్తారు. కూలీలు అందుబాటులో లేకపోవడంతో కొందరు రైతులు సొంతంగానే కొమ్మల కత్తిరిస్తున్నారు. ఉపాధి హామీ ద్వారా కొమ్మల కత్తిరింపు చేపట్టి చేయూతనివ్వాలని మామిడి రైతులు కోరుతున్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



చౌడేపల్లె, జూలై19: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే బోయకొండ మాజీ చైర్మన్లు ఎస్కే వెంకటరమణారెడ్డి, ఆయన సతీమణి రతీదేవిలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఏకాంబరంతో పాటు ఎస్కే దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

గురుపౌర్ణమి ఉత్సవాలకు ఎస్కే రూ.లక్ష విరాళం



చౌడేపల్లె, జూలై19: గురుపౌర్ణమి ఉత్సవాలకు టీడీపీ నాయకులు బోయకొండ ఆలయ మాజీ చైర్మన్ ఎస్కే వెంకటరమణరెడ్డి రూ.లక్ష విరాళాం అందించారు. శుక్రవారం ఆయన స్థానిక బజారు వీధిలో వెలసిన షిర్డిసాయిబాబా ఆలయంలో ప్రతి ఏటా ఆయన ఆర్థిక సహకారంతో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించడం ఆనవాయితి. ఈ క్రమంలో గురుపౌర్ణమి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, భక్తులకు అన్నదానం ఆయన సహకారంతో నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు రంగబాబు పేర్కొన్నారు.

ఘనంగా మంగల్ పాండే జయంతి



పలమనేరు, జూలై19 : పలమనేరులోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ప్రముఖ స్వాతంత్ర్య యోధులు మంగల్ పాండే 197వ జయంతిని ఘనంగా నిర్వహించారు. మంగల్‌పాండే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తాతయ్యనాయుడు, రమాదేవి, ఆంజినేయులు, వెంకటాద్రి, మునిరత్నం, శ్రావణ్‌కుమార్, చంద్రశేఖర్, న్యాయవాది సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ

పలమనేరు, జూలై 19 : మండలంలోని కొలమాసనపల్లి పీహెచ్‌సీ వద్ద నుంచి శుక్రవారం గ్రామంలో ఆశా వర్కర్లు, వైద్యఆరోగ్య సిబ్బంది క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి అనౌషి మాట్లాడుతూ ఈ నెల 18నుంచి ఆగస్టు 2వరకు క్షయవ్యాధిపై కొలమాసనపల్లి పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ఆశాలు ఇంటింటికీ వెళ్లి క్షయవ్యాధిని గుర్తించే కార్యక్రమం నిర్వహి స్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మధు, ఎంఎల్‌హెచ్‌పీఎస్, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రంలో పిచ్చిమొక్కల తొలగింపు



గుడుపల్లె, జూలై 19: గుండ్లసాగరం పంచాయతీలోని ఆరోగ్య ఉపకేంద్రం వద్ద శుక్రవారం ఏపుగా పెరిగిన ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలను కూలీల సహాయం తో జనసేన పార్టీ మండలాధ్యక్షులు అమీర్ తొలగించారు. ఆరోగ్య ఉప కేంద్రం భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో మూతపడింది. దీంతో భవనం లోపల, బయట పిచ్చి మొక్కలు పెరగడంతో విష సర్పాలు సంచారం అధికం అయ్యాయి. గ్రామస్తులు ఈ విషయాన్ని జనసేన మండలాధ్యక్షుడుకి తెలపడంతో ఆయన వీటిని తొలగింపజేశారు.

కుప్పం మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ


శ్రీనివాసరావు

కుప్పం, జూలై 19: కుప్పం మున్సిపల్ కమిషనర్‌గా వి.శ్రీనివాసరావు గురు వారం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ శ్రీనివాసరావును టీడీపీ కౌన్సిలర్ జిమ్ దాము మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కాగా గతంలో ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన నాగేశ్వరరావు ఆయన మాతృ సంస్థ అయిన నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంటుగా తిరిగి వెళ్లారు.

సూపర్‌బజార్ ఎన్నికలంటే ఉలికి పాటు ఎందుకు బోసూ?


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ పలమనేరు నాయకులు

ఐదేళ్ల అవినీతి నిగ్గు తేల్చాలంటూ టీడీపీ డిమాండ్

పలమనేరు, జూలై19 : పలమనేరు సూపర్‌బజార్ ఎన్నికలంటే ఎందుకు ఉలికి పాటు? అని సూపర్ బజార్ అధ్యక్షుడు బోస్‌ను శుక్రవారం టీడీపీ నాయకులు ప్రశ్నించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు బోస్ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత రెండురోజులుగా సూపర్‌బజార్ ఎన్నికలపై వస్తున్న వాయిస్ మెసేజ్‌లపై వారు స్పందించారు. 2016 లో ఎన్నికలు జరగాల్సినప్పటికి 2022 వరకు ఎన్నికల పేరు ఎత్తకుండా వైసీపీ వాళ్లతో కుమ్మక్కై ఎన్నికలు జరగకుండా చేసింది ఎవరని వారు ప్రశ్నించారు. 2016 నుంచి ఇప్పటి వరకు దాదాపు 16 సార్లు పదవి పొడిగించుకొన్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం నియమించిన పర్సన్ ఇన్‌ఛార్జి ఎన్నికలు నిర్వహించకూడదా అన్నారు. డీసీసీబీ, డీసీఎంఎస్ ద్వారా ఈ 5 సంవత్సరాల కాలంలో ఎంత అవినీతి జరిగిందో మీకు తెలియదా అని ప్రశ్నించారు. ఇకనైనా హుందాగా వ్యవహరించాలని వారు హితవు పలికారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్రమణ్యంగౌడు, శ్రీధర్, బీఆర్‌సి కుమార్, అమరనాథరెడ్డి, శ్రీనివాసులు, సుధాకర్, నదీమ్, జిలాని, బాలాజి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎప్పుడు ఎన్నికలు జరిగినా విజయం టీడీపీదే

వి.కోట: సూపర్ బజార్‌కు ఎప్పుడు ఎన్నికలు జరిగినా విజయం టీడీపీ మద్దతుదారులదేనని మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్ పేర్కొన్నారు. వి.కోట టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్‌బజార్ అధ్యక్షులుగా కొనసాగుతున్న బోస్ టీడీపీని విమర్శిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, మండల ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, మండల తెలుగు యువత అధ్యక్షులు ధీరజ్, జిల్లా అధికార ప్రతినిధి రామ్‌బాబు, నేతలు సుబ్రమణ్యంశెట్టి, హరినాథరెడ్డి, విశ్వనాథరెడ్డి, మురుగేష్, లక్ష్మణ్, రామూర్తి, రామచంద్రా తదితరులు ఉన్నారు.

భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలి

శాంతిపురం, జులై 19 : విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులు బంగారు బాటలు వేయాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రాళ్లబూదుగూరు, తుమ్మిశి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్, షూస్, బ్యాగులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ వారి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. తుమ్మిశి ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. రాళ్లబూదుగూరు ఉన్నత పాఠశాలలో ఆవరణలో మండల టీడీపీ నేతలు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి మొక్కలు నాటారు. తుమ్మిశి, రాళ్లబూదుగూరు పంచాయతీ టీడీపీ నాయకులు ఎమ్మెల్సీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ ఉదయకుమార్, క్లస్టర్ ఇన్‌చార్జీలు విజయ రామిరెడ్డి, చంద్రశేఖర్ యూనిట్ ఇన్‌చార్జీలు ఆర్ ఎస్ మణి, రెస్కో మాజీ వైస్ చైర్మన్ చలపతిస్వామి, ఏఎంసీ నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి పీవీ.నాగరాజు, బసవరాజు, సింగిరి శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు రామచంద్రయ్య, ధనలక్ష్మమ్మ పాల్గొన్నారు.

పెద్దిరెడ్డీ ఇప్పటికైనా మీతీరు మార్చుకోండి : టీడీపీ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రంగనాథ్

వి.కోట, జూలై 19: పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన తనయుడు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిలు ఇకనైనా వారి తీరు మార్చుకోవాలని పలమనేరు ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు హితవు పలికారు. శుక్రవారం పుంగనూరు ఘటనపై వైసీపీ చేస్తున్న విమర్శలను ఆయన తీవ్రంగా ఖండించారు. పుంగనూరులో కొన్ని రోజులుగా జరుగుతున్న ఘటనలకు పెద్దిరెడ్డి కుటుంబీకులు గతంలో చేసిన ఆగడాలే కారణమని పేర్కొన్నారు. భూ పరిహారం విషయంపై ఎంపీ మిథున్‌రెడ్డిని అడిగేందుకు వచ్చిన రైతులపై వైసీపీ వారు దాడులు చేయడం దుర్మార్గమన్నారు. పైగా టీడీపీ వారు వైసీపీ వారిపై దాడిచేశారని ప్రచారం చేయడం సరికాదన్నారు. ఇప్పుడు వేదాలు వల్లిస్తున్న వైసీపీ నేతలు గతంలో వారు చేసిన అరాచాకాలను ఓ సారి గుర్తుచేసుకోవాన్నారు. శ్రీకాకుళం నుంచి కుప్పాని సైకిల్‌పై వెళుతున్న టీడీపీ కార్యకర్తను దుస్తులు విప్పించినప్పుడు వైసీపీ నేతలు ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. చంద్రబాబును ఆయన సొంత నియోజకవర్గమైన కుప్పానికి రాకుండా పెద్దిరెడ్డి చేసిన అరాచకం ప్రజలందరికీ తెలుసన్నారు. అందుకే 11 సీట్లకు పరిమితం చేశారని వివరించారు. త్వరలో పెద్దిరెడ్డి అక్రమ దందాలు, ఆక్రమించుకున్న భూముల వివరాలు ప్రజల ముందు ఉంచుతామని తెలియజేశారు. ఇకనైనా మారకుంటే నియోజకవర్గ ప్రజలు చీకొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షులు ధీరజ్, నాయకులు రామ్‌బాబు, విశ్వనాథ్, సోము, శబరీష్, రుహుల్లా, షేక్‌ఉమ్మర్, హరినాథరెడ్డి, విశ్వనాథరెడ్డి, నవమోహన్ తదితరులు ఉన్నారు.

వెన్నంటి ఉంటా..అధైర్యపడకండి : ఎంపీ మిథున్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్ రెడ్డి

సదుం, జూలై 19: 'మీ వెన్నంటి ఉంటా. ఎవరూ అధైర్యపడకండి' అంటూ పుంగనూరు నియోజకవర్గ వైసీపీ శ్రేణులకు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం స్వగ్రామం ఎర్రాతివారి పల్లెలో నియోజకవర్గ పరిధిలోని పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల పార్టీ నాయకులు, కార్య కర్తలతో వేర్వేరుగా పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చిం చారు. తనతో పాటు తన బాబాయి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్ని వేళలా అందుబాటులో ఉంటామని, టీడీపీ నుంచి కార్యకర్తలకు ఎలాంటి సమస్య ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు పోకల అశోక్‌కుమార్, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నడింపల్లెలో కోలాహలంగా సిద్ధపూజలు

సోమల, జూలై 19: మండలంలోని నడింపల్లెలో ఎల్లమ్మ దేవత కొలుపు జాతరలో భాగంగా శుక్రవారం సిద్ధపూజలు కోలాహలంగా నిర్వహించారు. ఎల్లమ్మ దేవతను, ఆయుధాలను పల్లకిలో అలంకరించి బాణ సంచా వేడుకలతో, కీలుగుర్రాల నడుమ ఊరేగించారు. మహిళలు ఇంటింట మంగళహారతులు సమర్పించారు. అనంతరం రెండు రోజులుగా ఉపవాసదీక్షలో గ్రామ పొలి మేర్లలో ఉన్న సిద్ధులను ఆలయం వద్దకు తీసుకు వచ్చేం దుకు ఎల్లమ్మదేవత వేషధారి ప్రజలతో కలిసి రాగిమాను బండ వద్దకు తరలివెళ్లారు. సిద్ధులను ఆలయం వద్దకు ఆహ్వానించి పండ్లు సమర్పించి దీక్షలు విరమింప జేశారు. సిద్ధులను గ్రామంలో అమ్మవారితో కలసి ఊరేగించారు. ఈ పూజల్లో కరకమంద, సోమల, సదుం, నంజంపేట, కందూరు, సూరయ్యగారిపల్లె, చెన్నయ్యగారిపల్లె, అడు సుపల్లె తదితర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

నీటి కొళాయి ఏర్పాటుకు ఇంటింటా సర్వే


దండికుప్పంలో సర్వే చేపడుతున్న అధికారులు, నేతలు

శాంతిపురం, జులై 19 : ఇంటింటానీటి కొళాయి ఏర్పాటుకు అధికారులు గ్రామాల్లో శుక్ర వారం సర్వే చేపట్టారు. ఇంటింటికీ మంచినీరు అందిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం గ్రామాల్లో నీటి కొళాయి ఏర్పాటుకు అధికారులు సర్వే చేస్తున్నారు. మండలంలోని అన్ని పంచాయతీ కేంద్రాలలో సచివాలయ సిబ్బందితో కలిసి ఈవోపీఆర్‌డీ రవినాయక్ సర్వే చేశారు. కొళాయిలు, మరుగుదొడ్లు ఉన్నాయా లేవా అని విచారించారు. నియోజకవర్గంలో సర్వే పూర్తయిన తరువాత ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, టీడీపీ నేతలు యూనిట్ ఇన్‌చార్జి మునిరెడ్డి, గజేంద్రరెడ్డి, ఏకాంతరెడ్డి, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

అష్రఫ్‌కు చల్లాబాబు పరామర్శ



రొంపిచెర్ల, జూలై19: ఎంపీ మిథున్‌రెడ్డి రాక సందర్భంగా పుంగనూరులో గురువారం జరిగిన వైసీపీ దాడుల్లో గాయపడి తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్త అష్రఫ్‌ను పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి శుక్రవారం పరామర్శించారు. మంచి వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఆయనవెంట చౌడేపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు పతిరాజు తదితరులు ఉన్నారు.

జనసేన సభ్యత్వానికి శ్రీకారం

సోమల, జూలై 19: సోమల మండలంలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదుకు ఆ పార్టీ అధ్యక్షుడు సూరిశెట్టి నాగభూషణం రాయల్ శుక్రవారం శ్రీకారం చుట్టారు. చెన్నయ్యగారిపల్లె చెన్నకేశవస్వామి ఆలయంలో సభ్యత్వ నమోదు పుస్తకాలకు స్వామివారి పాదాల వద్ద పూజలు జరిపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల 28 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ నెల 21న సోమలలో ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు పూర్తి వివరాలకు 9676125446 నెంబరును సంప్రదించాలని కోరారు.

పోతురాజుకు బోనాల చెల్లింపు

సోమల, జూలై 19: సోమల పంచాయతీ చెన్నయ్యగారిపల్లెలో కొలువుదీరిన చెన్న కేశవ స్వామి ఆలయ ఉత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ సమీపంలోని పోతురాజు ఆలయం వద్దకు సోమల, కరకమంద, చెన్నయ్యగారిపల్లె, నడింపల్లె, దామలచెరువు, గూబలవారిపల్లె, సూరయ్యగారిపల్లె, గట్టువారిపల్లె భక్తులు చేరుకుని స్వామివారికి పొంగళ్లు పెట్టారు. దీలు, బోనాలు సమర్పించారు. అన్నదానాలు చేశారు.

బాగా చదివి ఉన్నతస్థాయికి చేరాలి



రొంపిచెర్ల, జూలై19: మంచి చదువులు చదివి ఉన్నతస్థాయికి చేరాలని రాజంపేట పార్ల మెంట్ టీడీపీ మైనార్టీ ఉపాధ్యక్షుడు జి.ఇమ్రాన్‌ఖాన్ కోరారు. శుక్రవారం రొంపిచెర్ల ఉర్దూ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం అందించే బ్యాగులు, పుస్తకాలు, ఇతర సామగ్రి అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రకాష్, ఉపాధ్యాయులు ఇర్ఫాన్, మదరసా కమిటీ చైర్మన్ గౌస్‌పీర్‌ఖాన్ పాల్గొన్నారు.

వీఆర్‌ఏ సంఘ కార్యవర్గం ఏకగ్రీవం

రొంపిచెర్ల,జూలై19: రొంపిచెర్ల మండల రెవిన్యూ సహాయ సంఘం కార్యవర్గం శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇర్ఫాన్‌అలీ తెలిపారు. మండల అధ్యక్షుడుగా ఎస్.నజీర్‌సాహెబ్, ఉపాధ్యక్షుడుగా కె.దామోదర్, కార్యదర్శిగా పి.ధనశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.విశ్వనాథం, ట్రెజరర్‌గా మల్లిక ఎన్నికైనట్లు వివరించారు.

అన్యాక్రాంత భూముల వివరాలివ్వాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

రొంపిచెర్ల,జూలై19: మండలంలో 2019 ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఏడాది జూన్ ఒకటో తేదీ వరకు జరిగిన భూ ఆక్రమణల వివరాలు ఇవ్వాలని జనసేన పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం సమాచారం హక్కు చట్టం కింద వివరాల కోసం తహసీల్దార్ ఏక్ మొహదీన్‌కు జనసేన మండల అధ్యక్షుడు శేఖర్‌రాయల్, కార్యకర్తలు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు హేమంత్‌కుమార్, ధనశేఖర్, రుకేష్, ఎస్.బావాజాన్, జయసూర్య పాల్గొన్నారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు

చౌడేపల్లె, జూలై19: పుదిపట్లలో వెలసిన స్వయంభు వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించాక ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వినోద్ కుమార్‌రెడ్డి, శ్రావణిలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేటి నుంచి గురుపౌర్ణమి మహోత్సవాలు

చౌడేపల్లె, జూలై19: స్థానిక బజారువీధిలో వెలసిన షిర్డి సాయి బాబా ఆలయంలో శనివారం నుంచి గురుపౌర్ణమి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు రంగబాబు పేర్కొన్నారు. 20న కాగడ హారతి, 108 ద్రవ్యాలతో అభిషేకం, పల్లకి సేవ, 21న కాగడహారతి, భక్తులతో పాలాభిషేకం, అన్నదానం, సాయంత్రం స్వామివారి ఊరేగింపు ఉంటుందని వివరించారు.

ఆక్రమణదారులకు నోటీసులు



శాంతిపురంలో ఆక్రమణలను గుర్తిస్తున్న అధికారులు

శాంతిపురం, జులై 19 : శాంతిపురంలో రోడ్డును ఆక్రమించిన వారికి అధికారులు నోటీసులు జారీ చేశారు. గత ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డు పెట్టుకొని కొంత మంది వైసీపీ నేతలు రోడ్డును ఆక్రమిం చుకొని భవనాలు నిర్మించారని కొంత మంది రైతులు అప్పటి రెవిన్యూ, ఆర్ అండ్ బీ అధికారులకు పలుసార్లు ఫిర్యాదులు చేశారు. రోడ్డును ఆక్రమించుకొని భవనాలు కట్టడం వల్ల పొలాలకు వెళ్లేందుకు దారిలేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అయినా సమస్య పరిష్కరించలేదు. చేసేదేమీ లేక ఐదేళ్లపాటు ఇబ్బందులు పడుతూ కాలం వెళ్లదీశారు. ప్రస్తుతం అధికారం మారిన నేపథ్యంలో కుప్పంలో ఈ నెల 4న నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మరోసారి రైతులు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. దీనిపైన స్పందించిన రెవిన్యూ, ఆర్ అండ్ బీ అధికారులు మండల కేంద్రంలో సర్వేలు చేసి ఆక్రమణలు గుర్తించారు. ఆక్రమణ దారులకు నోటీసులు జారీ చేశారు. 15 రోజులోగా ఆక్రమణలను తొలగించాలని లేకుంటే అధికారులే తొలగిస్తారని హెచ్చరించారు. సర్వేచేసిన వారిలో ఆర్ అండ్ బీ ఏఈ మంజుల, వీఆర్వో స్వామినాథం, మండల సర్వేయర్ సురేష్, విలేజ్ సర్వేయర్ వినోద్ ఉన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

పనులు చేయకుండానే బిల్లులు నొక్కేశారు


ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

విజయపురం, జూలై 19: మండలంలోని కాళికాపురం ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు రమేష్ అక్రమ మార్గంలో బిల్లులు తినేస్తున్నాడని గ్రామస్తులు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బ్రహ్మయ్యకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పనులు చేయకుండానే ఐదుగురిపై బిల్లులు చేసి జేబులో వేసుకున్నాడని, చర్యలు తీసుకోవాలని కోరారు. విచారించి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

చేతిబోరుకు మరమ్మతులు

విజయపురం, జూలై 19: మండలంలోని సామిరెడ్డి కండ్రిగ పంచాయతీ గొల్లకండ్రిగలో చేతిబోరుకు సర్పంచ్ సుబ్రహ్మణ్యం శుక్రవారం మరమ్మతులు చేయించారు. కరెంటు లేని సమయాల్లో, వర్షాకాలంలో ఉపయుక్తంగా ఉంటుందనే ఉద్దేశంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పంచాయతీలో పారిశుధ్యం, తాగునీటికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు.

పకడ్బందీగా స్టాప్ డయేరియా

యాదమరి, జూలై 19 : మండలంలో స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యాధి నిరోధక శాఖ అధికారి(డీఐవో) డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. మండలంలోని 70 కొత్తపల్లెలో జరుగుతున్న కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. మూడేళ్ల వయస్సున్న చిన్నారి తల్లితో మాట్లాడి ఆరోగ్య శాఖ సర్వే గురించి ఆరా తీశారు. ఓఆర్ఎస్‌ను ఎలా వాడాలి..ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాల గురించి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. సీహెచ్‌వో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రతిరోజూ చెత్త సేకరించాలి


చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో

యాదమరి, జూలై 19: ప్రతి రోజూ ఇంటింటి చెత్త సేకరణ చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారిణి లక్ష్మి అన్నారు. శుక్రవారం కోణాపల్లె పంచాయతీలో ఆమె పర్యటించి, చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. పంచాయతీ సెక్రటరీ, సచివాలయ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం

ఐరాల, జూలై 19: మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని వ్యాధులకు దూరంగా ఉందామని పొలకల పంచాయతీ ఉప సర్పంచ్ బత్తల సురేంద్రనాయుడు అన్నారు. పంచాయతీ పరిధిలో దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు శుక్రవారం పరిసరాలను శుభ్రం చేశారు. ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత అందరి బాధ్యతన్నారు.

పని సర్దుబాటు చేయండి : పీఆర్‌టీయూ

చిత్తూరు (సెంట్రల్), జూలై 19: జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో టీచర్లకు పని సర్దుబాటు చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రకాష్, స్వామి కన్నన్‌లు శుక్రవారం డీఈవో దేవరాజును కలిసి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులు అధికంగా ఉన్న చోట నుంచి లేని పాఠశాలలకు పంపాలని సూచించారు. రివర్షన్ కోరుకుంటున్న ఎల్ఎఫ్ ఎల్ హెచ్ఎంల అభ్యర్థనను పరిశీలించాలన్నారు. యూడైస్‌లో నమోదు చేసినా అటెండెన్స్ యాప్‌లో విద్యార్థుల పేర్లు చూపించడం లేదని డీఈవో దృష్టికి తెచ్చారు. చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. డీఈవోను కలిసిన వారిలో శ్రీనివాసులు, శంకర్, షకీల్ ఉన్నారు.

విధులకు గైర్హాజరైన టీచర్ సస్పెన్షన్

చిత్తూరు (సెంట్రల్), జూలై 19: ముందస్తు సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన ఐరాల మండలం మద్దిపట్లపల్లి ఎంపీపీఎస్ టీచర్ ఎం.చక్రవర్తిని సస్పెండ్ చేసినట్లు డీఈవో దేవరాజు తెలిపారు. 2022 అక్టోబరు 22 నుంచి ఆయన ఎవరికీ సమాచారం ఇవ్వకుండా విధులకు హాజరుకాలేదని పేర్కొన్నారు. ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ ఇచ్చినా స్పందన లేకపోవడం, ఇంటి చిరునామాలో లేకపోవడం వంటి కారణాలతో సస్పెండ్ చేసినట్లు తెలిపారు. దీనిపై ఆయన తనను నేరుగా కలిసి వివరణ ఇవ్వాలని తెలిపారు.

22న సీనియర్ సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

ఐరాల, జూలై 19: ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 22న ఉమ్మడి చిత్తూరు జిల్లా సీనియర్ సాఫ్ట్‌బాల్ జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌యాదవ్, కార్యదర్శి రమేష్ తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఒరిజినల్ ఆధార్, జనన ధ్రువీకరణ సర్టిఫికెట్ తీసుకురావాలని పేర్కొన్నారు. సొంత క్రీడా పరికరాలు తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు 7013989059, 958187409లను సంప్రదించాలని కోరారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



వెదురుకుప్పం, జూలై 19: పచ్చికాపల్లం మహా భారత ఉత్సవాలకు శుక్రవారం శాస్త్రోక్తంగా ధ్వజా రోహణం చేశారు. పెద్దపోదుజేను గ్రామానికి చెందిన బండి మోహన్‌రెడ్డి, బండి హేమసుందర్‌రెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. వారి ఇంటి నుంచి ధ్వజస్తంభ పూజకు సంబంధించిన వస్తు సామగ్రిని తీసుకొచ్చారు. ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త ఎస్.మునిరత్నం రెడ్డి, ప్రధాన కార్యనిర్వాహకులు బండి గోవర్ధన్‌రెడ్డి, బొజ్జారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈనెల 28వ తేదీ అగ్నిగుండ ప్రవేశంతో ఉత్సవాలు ముగుస్తాయి.

టీడీపీలోకి మాదిరెడ్డిపల్లె సర్పంచ్


మహాలక్ష్మిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

యాదమరి, జూలై 19: మండలంలోని మాదిరెడ్డిపల్లె వైసీపీ సర్పంచ్ మహాలక్ష్మి ఎమ్మెల్యే మురళీ మోహన్ ఆధ్వర్యంలో శుక్రవారం టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే ఆమెకు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురార్జీ, వెంకటేశ్ రబి, నేతలు విజయేంద్రయాదవ్, మనోహర్, చిట్టిబాబు, మధు, కన్నయ్య, గోవిందమందడి, దొరస్వామి మందడి పాల్గొన్నారు.

ఏపీ గ్రానైట్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

చిత్తూరు సిటీ, జూలై 19: ఏపీ గ్రానైట్ అసోసియేషన్ నూతన కమిటీని శుక్రవారం విజయవాడలో ఎన్నుకున్నారు. చిత్తూరుకు చెందిన వడ్లపాటి శేఖర్ బాబు వైస్ ఛైర్మన్‌గా, జాయింట్ సెక్రటరీలుగా రాళ్లపల్లి మోహన్ నాయుడు, మురళి, బి.అమర్నాథ్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రానైట్ పరిశ్రమల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

ఆరిమాని గంగమ్మకు ప్రత్యేక పూజలు



శ్రీరంగరాజపురం, జూలై 19: మండలంలోని ఆరిమాని గంగమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరణ చేసి, అర్చకుడు వెంకటాచలపతి అంకురార్పణ సమర్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వాటర్ షెడ్ మాజీ చైర్మన్ గుణశేఖర్ నాయుడు, వెంకటరమణ పాల్గొన్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే

కార్వేటినగరం, జూలై 19: తహసీల్దార్ కార్యాలయంలో కార్యకలాపాలు కొన్ని నెలలుగా స్తంభించాయి. ఇక్కడి తహసీల్దార్‌ను ఎన్నికల సమయంలో అనంతపురం జిల్లాకు బదిలీ చేశారు. కర్నూలు జిల్లా నుంచి మహిళా తహసీల్దార్‌ను ఇక్కడ నియమించారు. కొత్తగా వచ్చిన తహసీల్దార్‌కు మండల రెవెన్యూ కార్యకలాపాలపై అవగాహన లేకపోవడంతో ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదు. వివిధ సమస్యల పరిష్కారం కోసం మండల ప్రజలు నెలల తరబడి కార్యాలయం చుట్టూ చక్కర్లు కొట్టాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

రేపు కాణిపాకంలో ఆషాడ పౌర్ణమి వేడుకలు

ఐరాల(కాణిపాకం), జూలై 19: కాణిపాకంలో ఈ నెల 21వ తేదీన ఆషాడ పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఈవో వెంకటేశు శుక్రవారం తెలిపారు. అనుబంధ ఆలయమైన మణికంఠేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆలయంలోని మరగదాంబిక శాకాంబరి అలంకారంలో(కూరగాయలతో అలంకరణ) భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. ఆగస్టు ఒకటో తేదీ ఆస్థాన మండపంలో తిరుపతికి చెందిన మన సంస్కృతి కళా సంస్థ ఆధ్వర్యంలో భక్తి భజనగీతాలు, జానపద గీతాలాపన ఉంటాయని ఈవో వివరించారు.

ప్రభుత్వ స్కూళ్లలో నమోదు పెంచండి

చిత్తూరు (సెంట్రల్), జూలై 19: విద్యా ప్రవేశంపై దృష్టి సారించి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం పెంచాలని డీఈవో దేవరాజు ఆదేశించారు. శుక్రవారం తన ఛాంబర్ నుంచి సమగ్రశిక్ష సెక్టోరియల్స్, ఎంఈవోలు, హెచ్ఎంలతో ఆయన వెబెక్స్ నిర్వహించారు. గత ఏడాది కంటే అధికంగా విద్యార్థులు పాఠశాలల్లో చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. బడిబయటి పిలలను గుర్తించి, బడిలో చేర్పించాలని సూచించారు. కేజీబీవీల్లో ప్రవేశ గడువు ముగియనున్న నేపథ్యంలో విద్యార్థినులను కేజీబీవీల్లో చేర్పించాలన్నారు. ప్రతి విద్యార్థి వివరాలను యూడైస్‌లో నమోదు చేయాలని సూచించారు. టీచర్లు తప్పనిసరిగా ఫేషియల్ అటెండెన్స్ యాప్‌లో హాజరు నమోదు చేయాలని పేర్కొన్నారు.

విద్యార్థినులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి


వర్క్‌షాప్‌లో విజయం విద్యార్థినులు

చిత్తూరు (సెంట్రల్), జూలై 19 : విద్యార్థినులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగి పలువురికి ఉద్యోగావకాశాలు కల్పించాలని అమరరాజా గ్రూప్ కో-ఫౌండర్ జయదేవ్ గల్లా పేర్కొన్నారు. శుక్రవారం తిరుపతిలోని అమరరాజా ఆడిటోరియంలో సీ2 ఇండియన్ ఉమన్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో పయినీర్ ప్రోగ్రెస్ ఉమన్ లీడింగ్ పర్పస్ అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. విజయం విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ శైలజమూర్తి ఆధ్వర్యంలో ఆ విద్యా సంస్థల విద్యార్థినులు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ యువ దశలోనే ఆలోచనలు దేశ ప్రయోజనాలతో పాటు పలువురి శ్రేయస్సు కోరే విధంగా ఉండాలన్నారు. వ్యాపారంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనగలిగితే యువత పారిశ్రామిక రంగంలో రాణించగలరన్నారు.

వెంకటేశ్వర స్వామికి కానుకగా ఆభరణాలు



చిత్తూరు కల్చరల్, జూలై 19: స్థానిక మహాలక్ష్మీ గోదాదేవి ఆంజనేయ సమేత వెంకటేశ్వరస్వామికి శుక్రవారం మస్కట్‌లో ఉంటున్న చిత్తూరుకు చెందిన విజయ్, అర్చన దంపతులు 3.5 లక్షల విలువైన ఆభరణాలను బహూకరించారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ మునివేల్, అర్చకులు వారికి స్వాగతం పలికి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. వారిని ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆడిమాస తొలి శుక్రవార పూజలు

చిత్తూరు కల్చరల్, జూలై 19: నగరంలోని తమిళులు ఆడిమాసం(ఆషాడమాసం) తొలి శుక్రవార పూజలు ఘనంగా నిర్వహించారు. గుర్రప్పనాయుడు వీధి అంకాల పరమేశ్వరి అమ్మవారికి అభిషేకం, పూజలు చేశారు. విశేష పుష్పాలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. సంతపేట నాగాలమ్మ, చవటపల్లె కనకదుర్గ, గిరింపేట దుర్గాంబ ఆలయాల్లో పూజలు చేశారు.

ఘనంగా మాస మహిళా దినోత్సవం


రోగులకు ప్రసాదాలు పంపిణీ చేస్తున్న సత్యసాయి భక్తులు

చిత్తూరు కల్చరల్, జూలై 19: సత్యసాయి సేవా సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని ప్రసూతి, చిన్నపిల్లల వార్డుల్లో మాస మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సత్యసాయి సేవాసమితి మహిళా విభాగం సభ్యులు ప్రసూతి వార్డులోని గర్భిణులకు, చిన్నారుల తల్లులకు పండ్లు, పాలు, రొట్టె అందించారు. గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో ప్రేమతరు కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు మొక్కలు పంపిణీ చేశారు.

వాహనాలను ఎక్కడంటే అక్కడ పెట్టకండి


వాహనాలను యజమానులకు అప్పగిస్తున్న ఏఎస్పీ

పూతలపట్టు, జూలై 19: ద్విచక్ర వాహనాలను ఎక్కడబడితే అక్కడ పెట్టరాదని అడిషనల్ ఎస్పీ అరీఫుల్లా అన్నారు. ఈ నెల 14వ తేదీన రంగంపేట క్రాస్ సమీపంలో పూతలపట్టు సీఐ సుదర్శన ప్రసాద్ ఓ యువకుడి నుంచి స్వాధీనం చేసుకున్న 50 ద్విచక్ర వాహనాలను వాటి యజమానులకు శుక్రవారం అప్పగించారు. డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి, సీఐ సుదర్శన్ ప్రసాద్ పాల్గొన్నారు.

టీడీపీ నేతకు పరామర్శ

పూతలపట్టు, జూలై 19: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న టీడీపీ మండల నేత నాగరాజ నాయుడును పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ శుక్రవారం సాయంత్రం పరామర్శించారు. పోటుకనుమ గ్రామానికి చెందిన నాగరాజనాయుడు వారం క్రితం రంగంపేట క్రాస్ రోడ్డు ఫ్లైఓవర్ వద్ద ద్విచక్ర వాహనంలో వెళ్తూ అదుపుతప్పి రోడ్డుపై పడడంతో గాయపడ్డారు. వేలూరు సీఎంసీలో చికిత్స పొంది రెండ్రోజుల క్రితం ఇంటికి రావడంతో ఎమ్మెల్యే పరామర్శించారు.

పూతలపట్టులో రైతుబజారు ఏర్పాటుకు కృషి

మండల సమావేశంలో ఎమ్మెల్యే మురళీమోహన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, జూలై 19: పూతలపట్టులో రైతులు, ప్రజల సౌకర్యార్థం రైతుబజారు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో ప్రసన్న కుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వాధికారులు రాజకీయాలను పక్కనపెట్టి అభివృద్ధికి సహకరించాలని కోరారు. 46 ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో తాగునీటి సమస్య ఉన్నా పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేయడం ఏమిటని ప్రశ్నించారు. అలసత్వం చూపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయ్యప్పగారిపల్లె పంచాయతీ ఎంపీటీసీ కల్పన మాట్లాడుతూ కొండకిందపల్లిలో పశువైద్యాధికారులు లేకపోవడంతో పాడి రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే అప్పటికప్పుడే ఆ శాఖ జేడీకి ఫోన్‌చేసి విషయం చెప్పగా రేపటి నుంచి వైద్యాధికారులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయశాఖ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించాలన్నారు. పేటమిట్ట సర్పంచ్ రాధాకృష్ణమ నాయుడు మాట్లాడుతూ గ్రామంలో శ్మశానానికి దారి కల్పించాలని కొన్నేళ్లుగా కోరుతున్నా పట్టించుకోవడం లేదని చెప్పడంతో రెండ్రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అమరావతి నిర్మాణానికి డ్వాక్రా సంఘాల మహిళలు రూ.11.44లక్షలు విరాళం ఇవ్వడంపై వారిని ఎమ్మెల్యేతో పాటు సభ్యులు అభినందించారు. ఎంపీపీ కుమారి, జడ్పీటీసీ దేవిక, వైస్ ఎంపీపీ మురళీమోహన్ పాల్గొన్నారు. ఉపాధ్యాయ సంఘ నేతలు, సర్పంచులు, ఎంపీటీసీలు వేర్వేరుగా ఎమ్మెల్యేను సన్మానించారు.

ప్రతి విద్యార్థీ ప్రయోజకుడు కావాలి : ఎమ్మెల్యే


విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు (సెంట్రల్), జూలై 19 : ప్రతి విద్యార్థీ ప్రయోజకుడై దేశానికి, తల్లిదండ్రులకు ఉపయోగపడాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆకాంక్షించారు. నగరంలోని గాండ్లపల్లి, సంతపేటలోని మున్సిపల్ ఉన్నత పాఠశాల, చిత్తూరులోని బీఎన్ కన్నన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఆయన స్టూడెంట్ కిట్స్ అందజేశారు. పిల్లల చదువులు తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశంతో అమ్మకు వందనం పథకం ద్వారా ప్రభుత్వం ఆర్థిక ప్రయోజనం కల్పిస్తోందన్నారు. ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాం, షూలు అందిస్తోందని తెలిపారు. ప్రశాంత్ నగర్ నుంచి బస్సు సౌకర్యం లేదని కన్నన్ పాఠశాలకు చెందిన ఓ విద్యార్థి ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆర్టీసీ వారితో మాట్లాడి ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌రెడ్డి, మాజీ మేయర్ కఠారి అనురాధ, డీవైఈవో చంద్రశేఖర్, డీఐఈవో సయ్యద్ మౌల పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడండి


పనులను పరిశీలిస్తున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు రూరల్, జూలై 19: విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని రెడ్డిగుంట సెక్షన్ అధికారులను చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర ఆదేశించారు. శుక్రవారం రెడ్డిగుంట సెక్షన్‌కు సంబంధించిన లైన్లు, సబ్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. సబ్ స్టేషన్‌లో తప్పనిసరిగా ఫిర్యాదుల పుస్తకం ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. షిఫ్ట్ ఆపరేటర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాటరీ చార్జర్ ఓల్టేజి రీడింగును ప్రతి గంటకూ నమోదు చేయాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిత్తూరు రూరల్, జూలై 19: చిత్తూరు అర్బన్, పాలసముద్రం, గుడిపాల మండలాల్లో 33 కేవీ, 11 కేవీ సబ్ స్టేషన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు నగరంలో చర్చివీధి, ఎంజీఆర్ వీధి, పొన్నియమ్మ వీధి, సంతపేట విజయలక్ష్మీ కాలనీ, సాయినగర్, గాండ్ల వీధి, సంతపేటలోని మీసేవ దగ్గర, తిమ్మసముద్రం, దొంగబావి వీధి, ఇరువారం, మురగానిపల్లి, ఎస్‌బీఐ కాలనీ, శాంతిగనర్, సంజయ్ గాంధీ కాలనీ, బార్బర్ కాలనీల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. పాలసముద్రం, పరిసర గ్రామాల్లో, గుడిపాల మండలంలోని పానాటూరు, పరిసర ప్రాంతాల్లోనూ ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండండి


సమావేశంలో మాట్లాడుతున్న గీర్వాణి

గంగాధరనెల్లూరు, జూలై 19: బ్యాంక్ ఖాతాదారులు సైబర్‌క్రైమ్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని డీసీసీబీ హెడ్ ఆఫీస్ మేనేజర్ గీర్వాణి కోరారు. గంగాధరనెల్లూరు డీసీసీబీ బ్రాంచ్ ఆవరణలో ఖాతాదారులకు అక్షరాస్యతపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జాతీయ బ్యాంకుల్లో రుణాలు పొందాలంటే ప్రాసెసింగ్ చార్జీలు, డాక్యుమెంటేషన్ చార్జీలు భరించాల్సి ఉంటుందని, డీసీసీబీలో అలాంటివేమీ ఉండవని అన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలకు సకాలంలో సేవలు అందిస్తున్నామన్నారు. అనంతరం ఆమె బంగారంపై రుణాలు, ప్రధానమంత్రి జీవన జ్యోతి యోజన, సురక్ష భీమా యోజన పథకాలు, డిజిటల్ లావాదేవీలపై వివరించారు. రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళజాత ఆకట్టుకుంది. డీసీసీబీ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ మహేష్, మేనేజర్ విజయ, సింగిల్‌విండో సొసైటీ సీఈవో విజయకుమార్ రెడ్డి, స్టాఫ్ అసిస్టెంట్ మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్‌లో దోమల బెడద


దోమలకు ఆవాసంగా మురుగు నీటిగుంత

చిత్తూరు, జూలై 19 : నగరంలోని శాంతినగర్‌లో దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు చెబుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా దోమల సంగీతం, కాట్లతో కంటికి కునుకు లేకుండా పోతోందని ఆవేదన చెందుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని వాపోతున్నారు. డ్రైనేజీల్లో చెత్త పేరుకుపోవడం వల్ల మురుగు నీరు వీధుల్లోకి చేరుతున్నాయని తెలిపారు. అవి మడుగులాగా మారి దోమలకు ఆవాసంగా మారుతున్నాయన్నారు. ఈ విషయమై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి ఫిర్యాదు చేయడానికి ఫోన్ చేస్తే కలవలేదని తెలిపారు. వచ్చేవారం ఫిర్యాదు చేస్తామని కాలనీకి చెందిన ఓ రిటైర్డు ఉద్యోగి తెలిపారు.

వైభవంగా అర్జున తపస్సు



కార్వేటినగరం, జూలై 19: స్థానిక ధర్మరాజస్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జున తపస్సు కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. అర్జున వేషధారి తపస్మాన్ ఎక్కి, నిమ్మపండ్లు విసిరే కార్యక్రమం ఆసక్తికరంగా సాగింది. సంతాన ప్రాప్తి లేని మహిళలు తపస్మాన్ చుట్టూ వరపడ్డారు. నిమ్మపండ్లు దక్కించుకున్న మహిళలకు సంతాన ప్రాప్తి కలుగుతుందని నమ్మకం. అనంతరం వెండి నంది వాహనంపై సుబ్రమణ్యస్వామిని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు అర్పించారు.

హెల్మెట్ ధరించండి..ప్రాణాలు కాపాడుకోండి

కార్వేటినగరం, జూలై 19: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి, ప్రాణాలను కాపాడుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులురెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ లేని కారణంగా మృత్యువాతపడుతున్నారని, తప్పనిసరిగా ధరించాలని కోరారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ధనంజయరెడ్డి, అధ్యాపకులు కార్తీక్, విశ్వనాథరెడ్డి, జోగి ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధిలో కూలీల శాతాన్ని పెంచండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు రూరల్, జూలై 19: మండలంలో ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీల సంఖ్యను పెంచాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అధికారులను ఆదేశించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ 100 పనిదినాలు కల్పించాలన్నారు. శుక్రవారం చిత్తూరు ఎంపీడీవో కార్యాలయ అవరణలో 2023-24 ఆర్థిక సంవత్సరం ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాడి, చిన్నసన్నకారు రైతులు జీవాలను పరిరక్షించుకునేందుకు షెడ్ల నిర్మాణం నిమిత్తం 90 శాతం సబ్సిడీతో లోన్లు మంజూరు చేస్తున్నారని తెలిపారు. డ్వామా పీడీ రాజశేఖర్ మాట్లాడుతూ మండలంలో రూ.9,870 అక్రమాలు జరిగినట్లు గుర్తించామని, 15 రోజుల్లో రికవరీ చేయాలని ఆదేశించారు. చిత్తూరు జడ్పీటీసీ బాబు నాయుడు, ఎంపీపీ గీతా పాల్గొన్నారు.

బంగారు చైన్ చోరీ

చిత్తూరు, జూలై 19: సిగరెట్ కావాలని అడిగి ఓ మహిళ మెడలోని బంగారు చైన్‌ను లాక్కెళ్లిన ఘటన రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. సీఐ ఉలసయ్య వివరాల మేరకు... నగరంలోని సంతపేట ఆశ్రమం వీధిలో జ్యోతి చిల్లర దుకాణం నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఇద్దరు వ్యక్తులు మాస్కులు ధరించి వచ్చి సిగరెట్ కావాలని అడిగారు. ఆమె సిగరెట్ తీసిచ్చేలోపు మెడలో ఉన్న 32 గ్రాముల బంగారు చైన్‌ను లాక్కొని ద్విచక్రవాహనంలో పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కలెక్టర్‌ను కలిసిన డీసీవో పద్మజ

చిత్తూరు, జూలై 19: జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల డీసీవోగా పద్మజ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మధ్యాహ్నం కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో కొనసాగుతున్న గురుకుల పాఠశాలల అభివృద్ధి గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. చిత్తూరు బి.ఆర్. అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ ఆమె వెంట ఉన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



చిత్తూరు సిటీ, జూలై 19: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసయాదవ్‌ను తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి సన్మానించారు. శుక్రవారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో కలసి పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో పార్టీ పరిస్థితులపై చర్చించారు.

బజాజ్ ఎలక్ట్రికల్ వాహనాల ప్రారంభం

చిత్తూరు సిటీ, జూలై 19 : నగరంలోని సంతపేట ఆర్ఆర్ గార్డెన్స్‌లో బజాజ్ ఎలక్ట్రికల్ వాహనాలను డీటీసీ నిరంజన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. నగరంలో మొదటిసారిగా బజాజ్ సరికొత్త ఎలక్ట్రికల్ వాహనాలను తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. శ్రీనివాస మోటర్స్ అధినేత జీవరత్నం రెడ్డి, బజాజ్ ఆటో రీజనల్ మేనేజర్ కార్తికేయన్, చంద్రశేఖర్, బజాజ్ షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వంపై విషం చిమ్మడమే వైసీపీ ధ్యేయం : టీడీపీ

చిత్తూరు సిటీ, జూలై 19: ప్రభుత్వంపై విషం చిమ్మడమే ధ్యేయంగా వైసీపీ నేతలు పనిచేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ అన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వినుకొండలో ఇద్దరు వైసీపీ నేతల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు మరణిస్తే ఆ ఘటనను టీడీపీకి అంటగట్టేందుకు ప్రయత్నిస్తుండడం బాధాకరమన్నారు. వ్యక్తిగత తగాదాలతో జరిగిన హత్యకు రాజకీయ రంగు పులుముతూ శవ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ అధికారం కోల్పోయిన తర్వాత కూడా 9 మంది టీడీపీ కార్యకర్తలను పొట్టన పెట్టుకున్నారని అన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు 32 మంది బీసీలను, 21 మంది మైనార్టీలను, 17 మంది దళితులను, 130 మందికి పైగా టీడీపీ నేతలు, కార్యకర్తలను చంపారని ఆరోపించారు. ఇప్పుడు దాడులు, విధ్వంసాలు, హత్యల గురించి మాజీ సీఎం జగన్ మాట్లాడటం సిగ్గుచేటని పేర్కొన్నారు.

వ్యాధులపై అలక్ష్యం వద్దు

గుడిపాల, జూలై 19: సీజనల్ వ్యాధుల పట్ల అశ్రద్ధ వద్దని గుడిపాల వైద్యాధికారిణి సంధ్య అన్నారు. మండలంలోని పశుమంద గ్రామంలో శుక్రవారం 104 సేవలు, లెప్రసీ సర్వే నిర్వహించారు. సంధ్య మాట్లాడుతూ శరీరంలో ఏ మార్పు వచ్చినా వైద్యులను సంప్రదించాలన్నారు. కాచివడబోసిన నీటినే తాగాలని సూచించారు.

ఘనంగా మారియమ్మ తిరునాళ్ల

గుడిపాల, జూలై 19: మండలంలోని గొల్లమడుగు పంచాయతీ చింతగుంటూరు గ్రామంలో శుక్రవారం మారియమ్మ తిరునాళ్లను వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి పొంగళ్లు పెట్టి, మధ్యాహ్నం అన్నదానం చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన పుష్పపల్లకిలో ఊరేగించారు. మహిళలు కర్పూరహారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుడిపాల, జూలై 19: మండలంలోని పానాటూరు 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పానాటూరు, బొమ్మసముద్రం, గొల్లమడుగు తదితర గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ కరీంఖాన్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన

చిత్తూరు రూరల్, జూలై 19: మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే దశలవారీ ఆందోళన తప్పదని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు నాగరాజు హెచ్చరించారు. శుక్రవారం నాగయ్య కళాక్షేత్ర అవరణలో కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. ప్రజారోగ్యాన్ని కాపాడుతున్న పారిశుధ్య కార్మికులకు సరైన పనిముట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. వారికి రావాల్సిన అలవెన్సులు ఇవ్వడం లేదన్నారు. వెంటనే పరిష్కరించాలని కోరారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే

చిత్తూరు, జూలై 19: పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహన్ శుక్రవారం ఎస్పీ మణికంఠను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించారు. పూతలపట్టు నియోజకవర్గంలో లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తకుండా చూడాలని, అందుకు తగిన సహకారం అందిస్తానని తెలిపారు.